VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డునెం A 193

విశాలాంధ్ర

7ob016

సంపుటి 7 * విజయవాడ సోమవారం ఆషాఢం 2-1880 [జూన్ 23 1958] * సంచిక 93

ఇండొనీషియా విద్రోహుల రాజధాని ప్రభుత్వ వశం

జకార్తా, జూన్ 21

ఉత్తర సెలిబెస్‌లోని విద్రోహుల రాజధాని మెనడోను ఇండొనీషియా సైన్యాలు నేడు వశం చేసుకొన్నాయి. సైన్యాలకు వేలాది ప్రజలుకూడ సహాయం చేశారని మకాస్సార్ రేడియో వెల్లడించింది. దీనితో విద్రోహుల కట్టకడపటి రక్షకస్థావరం ప్రభుత్వానికి వశమైనట్లే

Iris Inks for ALL PENS IN FIVE COLOURS

ఐరిస్ సిరాలు

ఫౌన్‌టెన్ కలాలకు చాలా మంచివి.

తయారు చేయువారు :

Research Chemical Laboratories,

Madras - 4, Bangalore - 3 New Delhi - 1.

RECHLAB'S Iris INK

మనలను మనం సంరక్షించుకోవడానికే శాంతి ఉద్యమం

స్టాక్ హోమ్ శాంతిసభా లక్ష్యాలను బలపరుస్తూ మద్రాసు సభలో రాజాజీ ప్రసంగం

నాగిఉరితీతశిఖరాగ్రచర్చలకు ఆటంకంకారాదని హెచ్చరిక

మద్రాసు, జూన్ 21

మనలను మనం సంరక్షించుకోవడానికైనా శాంతి ఉద్యమాన్ని ఇకనుండి ప్రతిఒక్కరికి సంబంధించిన ఉద్యమంగా పరిగణించుకోవాలని నేడిక్కడ ప్రసంగిస్తూ శ్రీ రాజగోపాలాచారి ఉద్బోధించారు.

వచ్చే నెలలో స్టాక్‌హోమ్‌లో జరుగబోతున్న ప్రపంచ శాంతి మహాసభ లక్ష్యాలను బలపరచేందుకు నేడిక్కడ జరిగిన మద్రాసు రాష్ట్ర శాంతి సదస్సులో శ్రీయుత్ రాజగోపాలాచారి, కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్, తమిళనాడ్ కమ్యూనిస్టు నాయకుడు శ్రీ రామమూర్తి ఒకే వేదికపై నుండి ప్రసంగించారు.

శ్రీ నంబూద్రిపాద్‌తో కలిసి ఒకే వేదికనుండి ప్రసంగించడానికి తనకు సంతోషంగా వున్నదని రాజాజీ అన్నారు.

శ్రీ నంబూద్రిపాద్ సదస్సును ప్రారంభించుతూ స్టాక్‌హోమ్‌లో జూలై 16 నుండి 22 వరకూ వివిధ దేశాలమధ్య సహకారంకోసం, సహజీవనంకోసం జరుగుతున్న మహాసభా లక్ష్యాలను వివరించడానికే తన ప్రసంగాన్ని పరిమితం చేశారు.

మహాసభను బలపరచేందుకు దాని లక్ష్యాలన్నింటినీ పూర్తిగా అంగీకరించవలసిన అవసరంలేదని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

రాజాజీ ప్రసంగం

ఆ తరువాత శ్రీ రాజగోపాలాచారి ప్రసంగిస్తూ స్టాక్‌హోమ్‌లో జరుగబోయే మహాసభ నిరాయుధీకరణ సమస్యకంటే అణ్వస్త్రాల పాటవ పరీక్షలను, అణ్వస్త్రాల వినియోగాన్ని నిషేధించేందుకే హెచ్చుదృష్టిని కేంద్రీకరించాలి అన్నారు. మారణాయుధాలను అట్టిపెట్టుకొన్నందువలన పెద్దగా ప్రమాదం లేదు. అణ్వస్త్రాలవలన ప్రపంచ వాతావరణం విషపూరితమయ్యే ప్రమాదం గలదని ఆయన హెచ్చరిక చేశారు.

రాజాజీ యింకా ఇలా అన్నారు:

నిరాయుధీకరణ సమస్యపై జరిగే చర్చల్లో పెద్దగా మనం చిక్కుకోవరాదు. ఎందుకల్లనంటే నా జీవిత కాలంలో నిరాయుధీకరణ ఆమోదించబడి ఆచరణలో పెట్టబడుతుందనే ఆశాభావం నాకేమాత్రం లేదు. అదీగాక నిరాయుధీకరణ సమస్యలో వివిధ దేశాల జనాభా సమస్య కూడా మిళితమై వుంటుంది. కాబట్టి ఆ సమస్యకు ఎంత ప్రాధాన్యత నివ్వరాదు.

అణ్వస్త్రాల విషయం అలాంటిది కాదు. అణ్వస్త్రాల పాటవ పరీక్షలను కొనసాగించడమంటే ప్రపంచ ప్రజలందరి ప్రధాన హక్కులకు భంగం కలిగించే నేరం చేయడమే కాగలదు.

సోవియట్ యూనియన్ వోర్మి ప్రశంసనీయం

ఇతరులతో నిమిత్తం లేకుండా తనంతట తానుగా అణ్వస్త్రాల పాటవ పరీక్షలను నిలుపుదల చేయడానికి సోవియట్ యూనియన్ నిర్ణయం తీసుకొన్నందుకు స్టాక్‌హోమ్ మహాసభ రష్యాను ప్రశంసించాలని రాజాజీ కోరారు.

"పశ్చిమ రాజ్యాలు ఈ విషయంలో తనను అనుసరించకపోయినప్పటికీ సోవియట్ యూనియన్ ఎంతగానో వోర్మిని ప్రదర్శించి, ఇంకా తన నిర్ణయాన్ని పాటించుతున్నదన్న విషయాన్ని మనం గుర్తించాలి. ఈ వోర్మినే ఇకముందు కూడా సోవియట్ ప్రదర్శించి అణ్వస్త్ర పాటవ పరీక్షలను తిరిగి ప్రారంభించదని మనం ఆశించుదాం."

శాంతిఉద్యమ చరిత్రను గురించి రాజాజీ ప్రస్తావించి ఇలాఅన్నారు:

శాంతిఉద్యమాన్ని మొదట రష్యా ప్రారంభించింది కాబట్టి దాని నిజాయితీనిగురించి శంకించడానికి గతంలో కారణం వుండివుండవచ్చు కాని ఇప్పుడు రష్యా తనంతట తానుగానే బలమైన శక్తినని రుజువు చేసుకోగలిగింది. అందువలన శాంతి ఉద్యమం తన కాళ్లపై తాను నిలబడి వుంది. మనల్ని మనం సంరక్షించుకోడానికైనా శాంతి ఉద్యమాన్ని ఇక నుండి ప్రతి ఒక్కరి ఉద్యమంగా పరిగణించుకోవడం అవసరం.

ఇమ్రి నాగి ఉదంతం

హంగరీ మాజీ ప్రధాని ఇమ్రి నాగి ఉరితీతనుగురించి రాజాజీ తన ప్రసంగంలో ప్రస్తావించి ఇలా అన్నారు:

అది ఒక "పొరపాటు" కావచ్చు విచారణ జరపకుండా ఒకరికి ఉరిశిక్షను విధించడం "అసమంజసమే" కావచ్చు. అయితే శిఖరాగ్ర చర్చలను జరపరాదనడానికి అమెరికా దీనినొక సాకుగా చూపెట్టడం ఏమాత్రం న్యాయం కాజాలదు. ఈ సందర్భంలో ఒక విషయాన్ని మీకు గుర్తుచేయదలచాను. భారతదేశంలో ఎలాంటి విచారణలేకుండా భారతీయ దేశభక్తులను అనేకమందిని బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసినప్పుడు అమెరికా బ్రిటన్‌తో తన దౌత్యసంబంధాలను తెంచుకొన్నదా? కనీసం బ్రిటన్‌కు తన అసమ్మతినైనా తెలిపిందా అని ప్రశ్నించుతున్నా.

కాబట్టి తాను అవసరమనుకొంటే ఇమ్రి నాగి ఉరితీతపట్ల అమెరికా తన అసమ్మతిని తెలుపవచ్చు. అంతే కాని దీనినొక సాకుగా తీసుకొని సోవియట్ యూనియన్‌తో శిఖరాగ్ర చర్చలకు అమెరికా నిరాకరించరాదు.

శిఖరాగ్ర సమావేశ చర్చల ఫలితాన్ని గురించి వ్యక్తిగతంగా తనకు గొప్పవిశ్వాసంలేదని రాజాజీ అన్నారు. ఏదిఏమైనా శిఖరాగ్ర సమావేశం జరగాలి. ఆ సమావేశం ఎవ్వరినీ చంపదుగదా అని ఆయన అన్నారు.

ఆ తరువాత కమ్యూనిస్టు నాయకుడు శ్రీ పి. రామమూర్తి ప్రసంగిస్తూ ప్రపంచ దేశాలమధ్య యుద్ధాన్ని నివారించాలంటే పంచశీల సూత్రాలను ఖచ్చితంగా అనుసరించడం అవసరమన్నారు.

బోస్‌కమిటీముందు కామత్ సాక్ష్యం

ముంద్రా కుంభకోణంపై విచారణ

న్యూఢిల్లీ, జూన్ 21

ముంద్రా కుంభకోణంలో అధికారుల పాత్రను గురించి దర్యాప్తు జరుపుతున్న బోసు కమిటీ నేడు జీవిత భీమా కార్పొరేషన్ అధ్యక్షుడైన శ్రీ జి. ఆర్. కామత్ వద్ద సాక్ష్యం తీసుకొన్నది.

కామత్ ప్రస్తుతం సెలవులో వున్నారు.

జీవిత భీమా కార్పొరేషన్ పెట్టుబడులను దుర్వినియోగపరిచినట్లు ఆరోపించబడిన ముగ్గురు అధికారులలో కామత్ ఒకరు. తతిమ్మా యిద్దరిలో ఒకరు ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రధాన కార్యదర్శి హెచ్. యమ్. పటేల్, మరొకరు జీవిత భీమా కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వైద్యనాథన్.

వీరిద్దరు కూడా ప్రస్తుతం సెలవులోనే వున్నారు. వీరి వద్ద బోసు కమిటీ యింతకుముందే సాక్ష్యం తీసుకొన్నది

స్టేట్ బ్యాంకు అధిపతి శ్రీ భట్టాచార్యను బోసు కమిటీ ఒకసారి విచారణ జరిపింది. మరల జూన్ 23 వ తేదీన ఆయన కమిటీ ముందు హాజరు కావలసివుంది.

జూన్ 26 వ తేదీనుండి కమిటీ ముందు వాదనలు ప్రారంభమవుతాయి.

నంబూద్రిపాద్ సౌశీల్యం

— రాజాజీ ప్రశంస

మద్రాసు, జూన్ 21

కేరళ ముఖ్యమంత్రి శ్రీ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్ గొప్ప సౌశీల్యంగల వ్యక్తి అని నేడు చక్రవర్తుల రాజగోపాలాచారిగారు కీర్తించారు.

మద్రాసు ప్రజలు తమతమ రాజకీయాభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేరళ ముఖ్యమంత్రికి ఈ నగరంలో ఘనస్వాగత మివ్వాలని రాజాజీ చెప్పారు. ఈ మహానగర మనే కుటుంబానికి పెద్దలాంటి తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానన్నారు

స్టాక్‌హోం శాంతి మహాసభను బలపరచడంకోసం నేటి సాయంత్రం ఇక్కడ జరిగిన శాంతి సదస్సు సందర్భంలో ఈ రాజకీయవేత్తలిద్దరూ ఒక వేదికమీద నుంచి ఉపన్యాసాలు చేశారు.

శ్రీ నంబూద్రిపాద్‌ను ప్రశంసిస్తూ రాజాజీ ఇంకా ఇలా అన్నారు:

నేనూ నంబూద్రిపాద్ జైల్లో కలిసి వున్నాం. ఆయన నడవడిని, సౌశీల్యాన్ని చూసి అప్పుడే ముగ్ధుణ్ణయ్యాను. ఆయన నుంచి చాలా ఆశించాను. ఆశించినదానిలో చాలా భాగం ఇప్పుడు నెరవేరింది.

వ్యక్తుల అభిప్రాయ లేమైనప్పటికీ దేశానికి సౌశీల్యవంతులు కావాలి. అలాంటివారిలో శ్రీ నంబూద్రిపాద్ ఒకరు. సౌశీల్యంగలవారు ప్రతిపక్షంలో వున్నప్పటికీ ప్రభుత్వ నాయకుని కన్నా శక్తివంతులుగా వుంటారు.

ఇండియాను అధిగమించి చైనా పురోభివృద్ధి

ఇటీవల చైనాలో పర్యటించి వచ్చిన కాంగ్రెసు పార్లమెంటు సభ్యుని అభిప్రాయం

న్యూఢిల్లీ, జూన్ 19

సోషలిజాన్ని స్వీకరించిన బహుకొద్దికాలంలోనే చైనా పారిశ్రామికంగా భారతదేశాన్ని మించి అభివృద్ధిచెందినదని ఇటీవలనే ఆ దేశంలో పర్యటించి వచ్చిన కాంగ్రెసు పార్లమెంటు సభ్యుడు ఢిల్లీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అయిన శ్రీ బ్రహ్మప్రకాష్ అన్నారు.

ఉక్కు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో భారతదేశాన్ని చైనా అధిగమించినదని ఆయనన్నారు.

భారత-చైనా మిత్రమండలి తరఫున ఇటీవల చైనాలో పర్యటించి వచ్చిన పదిమందితోకూడిన ప్రతినిధి వర్గానికి శ్రీ బ్రహ్మప్రకాష్ నాయకత్వం వహించారు.

తన చైనా పర్యటన అనుభవాలను గురించి శ్రీ బ్రహ్మప్రకాష్ నేడు పత్రికా గోష్టిలో వివరించారు.

ఆయన ఈక్రిందివిధంగా చెప్పారు:

చైనాలో నిరుద్యోగ సమస్య దాదాపు లేదనవచ్చు. నిజానికింకా అవసరమైనంతగా వ్యావసాయిక, పారిశ్రామిక కార్మికులు లభ్యం కావడం లేదు. కార్మికులకు నెలకు కనీసవేతనం 80 రూపాయలు. రెండుకోట్ల 50 లక్షల కార్మికులలో అయిదోవంతుకు పరిశుభ్రమైన ఇండ్లను కట్టించిపెట్టారు. క్రమేణా కార్మికుల జీతాలు యింకా పెరుగుతున్నాయి. ఆహారం, బట్ట వగయిరాల ధరలు స్థిరంగా నిలబడుతున్నాయి. కార్మికులలో అసంతృప్తి దాదాపు లేదనవచ్చు.

పోస్టర్లను అతికించడంద్వారా, కరపత్రాలను పంచిపెట్టడంద్వారా నిరంకుశత్వాన్ని విమర్శించడానికి కార్మికులకూ, ప్రజలకూ స్వాతంత్ర్యం యివ్వబడింది. ఈ కొత్త పద్ధతిని ప్రవేశపెట్టిన తరువాత అవినీతి, ఆశ్రిత పక్షపాతం బాగా తగ్గిపోయింది.

శ్రీ బ్రహ్మప్రకాష్ నాయకత్వాన చైనాలో పర్యటించిన భారత ప్రతినిధివర్గం ఉత్తర కొరియాలోకూడా పర్యటించి వచ్చింది.

గుజరాతీభాషారాష్ట్రసాధనకై అంతిమ పోరాటానికి పిలుపు

మహాగుజరాత్ జనతా పరిషత్ కేంద్ర సమితి ఏకగ్రీవ తీర్మానం

బరోడా, జూన్ 21

గుజరాతీ భాషారాష్ట్ర సాధనకై అంతిమ పోరాటానికి సంసిద్ధులు కావాలని గుజరాతీ ప్రజలకు పిలుపు నిస్తూ మహాగుజరాత్ జనతాపరిషత్ కేంద్ర సమితి నేడొక తీర్మానం చేసింది.

అయిదు గంటలపాటు చర్చలు జరిపిన తరువాత పరిషత్ కేంద్ర సమితి ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

సమావేశానికి శ్రీ ఇందులాల్ యాగ్నిక్ అధ్యక్షత వహించారు.

గత రెండు సంవత్సరాల కాలంలో ఆర్థికంగా, పారిశ్రామికంగా, పరిపాలనరీత్యా జరిగిన అనేక అన్యాయాలు మహాగుజరాత్ నిర్మాణ అవసరాన్ని మరింతగా బలపరుస్తున్నాయని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

ద్విభాషారాష్ట్ర నిర్మాణానికై భారత పార్లమెంటు చేసిన నిర్ణయాన్ని మార్చగల హక్కు బొంబాయి శాసనసభకు గలదని హోం వ్యవహారాల మంత్రి పండిత పంత్ ఇంతకుముందు చెప్పివున్నారు. అదే కేంద్ర ప్రభుత్వ నిశ్చితాభిప్రాయమన్న విషయాన్ని స్పష్టంగా తెలుసుకొన్నమీదటనే పోరాటాన్ని ప్రారంభించాలని ఆ తీర్మానంలో వుంది.

ఆగస్టు ఎనిమిదవ తేదీన మృతవీరుల దినోత్సవాన్ని జరపాలని కోరుతూ కేంద్ర సమితి మరొక తీర్మానం చేసింది.

రైల్వే కార్మికుల ఐక్యతకుసన్నాహాలు

దక్షిణరైల్వే ఎంప్లాయిస్ యూనియన్‌లో విలీనీకరణకు సదరన్ రైల్వే లేబర్ యూనియన్ (గోల్డెన్ రాక్) సంసిద్ధత

క్విలన్, జూన్ 22

దక్షిణరైల్వే ఎంప్లాయిస్ యూనియన్‌తో విలీనం కావడానికి తన సంసిద్ధతను వెల్లడిస్తూ సదరన్ రైల్వే లేబరు యూనియన్ (గోల్డెన్‌రాక్) కేంద్ర కార్యవర్గం ఏకగ్రీవంగా నేడు ఒక తీర్మానం చేసింది.

దక్షిణ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్‌కు శ్రీయస్. గురుస్వామి అధ్యక్షుడు.

విలీనీకరణానికి దక్షిణ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ అంగీకరించే పక్షంలో దానితో వివరాలను గురించి సంప్రతింపులను జరపడానికి ముగ్గురుతోకూడిన ఒక ఉపసంఘాన్ని కేంద్ర కార్యవర్గం నియమించింది. ఉపసంఘంలో ఈ క్రింది వారు ముగ్గురూ వుంటారు:

కె. ఆనంద నంబియార్, యస్. కృష్ణస్వామి, శ్రీమతి పార్వతీకృష్ణన్

కేంద్ర కార్యవర్గం చేసిన తీర్మానాన్ని అధ్యక్షుడు శ్రీ యస్. కళ్యాణసుందరం పత్రికలవారికి వివరించాడు. సదరన్ రైల్వే లేబర్ యూనియన్‌లో 18 వేల సభ్యత్వం వుంది. రెండు యూనియన్‌లు ఐక్యమైతే రైల్వే కార్మికుల కష్టాల తొలగింపుకు ఐక్యంగా పనిచేయడానికి వీలు కలుగుతుందని ఆయనన్నారు.

రెండు యూనియన్‌లు ఏకమైతే మొత్తం దక్షిణ రైల్వే కార్మికులలో దాదాపు 40 వేల కార్మికులు ఒకే సంఘంక్రింద ఐక్యం కాగలరన్నారు.

'యుద్ధవిరమణ శ్రేణి దాటనీయం'

పాకిస్తాన్ ప్రధానిప్రకటన

కరాచీ, జూన్ 21

ఏ పరిస్థితుల్లోనూ కాశ్మీరు యుద్ధ విరమణ శ్రేణిని గురించి భారత పాకిస్తాన్ ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందాన్ని భగ్నంచేసే ప్రయత్నాలను తాము సాగనీయమని పాకిస్తాన్ ప్రధాని నూన్ నేడు అన్నారు.

చౌదరి గులాం అబ్బాస్ జూన్ 27 న యుద్ధవిరమణ శ్రేణిని దాటి భారత భూభాగంలో ప్రవేశిస్తామని చేసిన ప్రకటనను నేడు పాకిస్తాన్ మంత్రివర్గం అత్యవసర సమావేశం జరిపి చర్చించింది. ఆ తరువాత శ్రీ నూన్ ప్రకటన చేశారు.

శ్రీ నూన్ ఇలా అన్నారు:

"యుద్ధవిరమణ శ్రేణిని దాటినందువల్ల ఏర్పడే పరిణామాలను గూర్చి నేనూ నాసహచరులం దీర్ఘంగా చర్చించాము. దీన్ని అనుమతించబోమని మేము ఎన్నోసారులు విస్పష్టంగా ప్రకటించాము. కొందరు యుద్ధవిరమణ శ్రేణిని దాటి భారత భూభాగంలోకి ప్రవేశిస్తారనే వార్తలు వచ్చాయి.

"ఈ వార్తలదృష్ట్యా ఈ సమస్యను మళ్ళీ తీక్ష్ణంగా చర్చించాము. ఎట్టి పరిస్థితుల్లోనూ యుద్ధవిరమణ శ్రేణిపై జరిగిన ఒడంబడికను భగ్నంచేయకూడదని మరొకసారి పునరుద్ఘాటిస్తున్నాము. ఈ నిర్ణయాన్ని అమలు జరపడానికి అవసరమయిన చర్యలు ప్రభుత్వం తీసుకొంటుంది."

యుద్ధవిరమణశ్రేణి ఒప్పందాన్ని భగ్నంచేయడంవల్ల ఐరాస అధ్యక్ష్యాన శాంతియుతంగా కాశ్మీర్ సమస్య పరిష్కారం కాకుండా పోతుందని కూడ నూన్ హెచ్చరించారు.

పన్నులు! పన్నులు!! పన్నులు!!!

హైద్రాబాద్, జూన్ 21

చుట్ట కాలుస్తే పన్ను వేశాం, కారులో ప్రయాణంచేస్తే పన్ను, ధోవతి కడితే పన్ను, చీర కడితే పన్ను, టీ తాగితే పన్ను, ప్రతి దానిమీద పన్ను వేశాం. ఇంకా కొత్తపన్ను ఏం వేయాలో తోచడం లేదు అని కేంద్ర సివిల్ ఆదాయ వ్యయాల మంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు నేడిక్కడ ఆదాయపుపన్ను ఉద్యోగుల సమావేశంలో ప్రసంగిస్తూ చెప్పారు. (వి. పి.)

చక్కరై చెట్టియార్ సమాధికినంబూద్రిపాద్ పుష్పాంజలి

మద్రాసు, జూన్ 21

కేరళ ముఖ్యమంత్రి శ్రీ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్ చక్కరై చెట్టియార్ సమాధివద్దకు వెళ్ళి పుష్పాంజలి సమర్పించారు.

ఇక్కడ ఒక నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న గాంధేయ అర్థశాస్త్రవేత్త శ్రీ జె. సి. కుమారప్పను చూచివచ్చారు.

నాగా తిరుగుబాటు దార్లతో పాక్ ముఖ్యనాయకులపొత్తు

షిల్లాంగ్‌లో ఒక వ్యక్తి ఇంటిలో సి. ఐ. డి. శాఖవారు పట్టుకొన్న పత్రాలవల్ల వెల్లడి

షిల్లాంగ్, జూన్ 21

నాగా తిరుగుబాటు నాయకులకూ, పాకిస్తాన్‌లోని ముఖ్య నాయకులకూ మధ్య సన్నిహిత సంబంధాలున్నట్లు షిల్లాంగ్‌లోని డల్లీనామో అనే వ్యక్తివద్ద పట్టుబడ్డ కొన్ని పత్రాలవలన ఖచ్చితంగా తెలియవస్తోంది.

షిల్లాంగ్ పోలీసులతో కలిసి రాష్ట్ర సి. ఐ. డి. శాఖవారు ఈ వేళ ఉదయం డల్లీనామో అనే వ్యక్తి ఇంటిని సోదాచేశారు. డల్లీనామోకు కాలింగ్ అంగ్లేవో అనే పేరుకూడా వుంది. ఆయింటిలో దొరికిన ఒక పెట్టె నిండా కొన్ని పత్రాలున్నాయి. నాగా తిరుగుబాటు నాయకులకూ, పాకిస్తాన్‌లోని ముఖ్య నాయకులకూ మధ్య సన్నిహితమైన సంబంధాలున్నట్లు ఆ పత్రాల ద్వారా ఖచ్చితంగా బయటపడుతున్నది

పాకిస్తాన్ ప్రభుత్వంలో ముఖ్యమైన పదవులను నిర్వహించే కొంతమంది వ్యక్తులకు నాగా తిరుగుబాటు నాయకులు వ్రాసిన లేఖలు కూడా ఆ పెట్టెలో వున్నాయి.

భారతదేశానికి వ్యతిరేకంగా నాగా తిరుగుబాటుదార్లు చేస్తున్న యుద్ధానికి పాకిస్తాన్‌నుండి పూర్తి సహాయం వుండగలదని తెలిపే పత్రాలుకూడా పట్టుబడ్డాయి

షిల్లాంగ్‌లోవుండే పాకిస్తాన్ రాయబార కార్యాలయంలోని ప్రముఖ అధికారుల పేర్లు కూడా ఆ లేఖల్లో ప్రస్తావించబడినాయి

నాగా తిరుగుబాటు నాయకులకు, కరాచీకి మధ్య షిల్లాంగ్‌లోని దౌత్య కార్యాలయంద్వారా డల్లీనామో ఒక సంధానకర్తగా పనిచేస్తున్నట్లు ఈ పత్రాలద్వారా సి. ఐ. డి శాఖవారు అనుమానిస్తున్నారు.

నాగా జాతీయ సమితి ఉపాధ్యక్షుడు పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్రాసిన లేఖకూడా పట్టుబడింది. అందులో డల్లీనామో పాకిస్తాన్ వెళ్ళడానికి నియమించినట్లు వుంది.

డల్లీనామో ఈ సంవత్సరం బి. ఏ. పరీక్షకు కూర్చున్నాడు ఈయన ఇంతకుముందు షిల్లాంగ్‌లోని అటవీశాఖ సీనియర్ ఆఫీసరు కార్యాలయంలో తాత్కాలికంగా స్టెనోగ్రాఫర్‌గా పనిచేశాడు ఇతడు నాగాకొండల్లోని ఒక గ్రామానికి చెందినవాడు

ఆయుధాల పోటీ యుద్ధానికే దారితీస్తుంది

కృశ్చేవ్ హెచ్చరిక

మెల్బోర్న్, జూన్ 21

ఇక్కడనుండి ప్రకటింపబడే మెల్బోరన్ హెరాల్డుకు లేఖవ్రాస్తూ సోవియట్ ప్రధాని కృశ్చేవ్ ప్రస్తుతం ప్రాచ్యపాశ్చాత్యదేశాల మధ్య జరుగుతున్న ఆయుధాలపోటీ యుద్ధానికి దారితీయక తప్పదని అన్నారు.

"స్పుత్నిక్‌ను అంతరిక్షంలోనికి పంపించే రాకెట్టును యుద్ధావసరాలకు వినియోగించకూడదని చెప్పేవారే ఖండాంతర రాకెట్ నిర్మించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మారణ హోమానికై ఉద్దేశించబడిన ఈ ఆయుధం రెండు పక్షాలకూ వుంటే తప్ప శాంతిని కాపాడలేమని అమెరికా, బ్రిటన్ దేశాల వాదం. ఈ ఆయుధాల పోటీ ఫలితం తుదకు యుద్ధానికి దారితీయక తప్పదు"

రుమేనియాకు భారత ప్రతినిధి బృందం పయనం

నూనెశుద్ధి కర్మాగారం విషయంలో సంప్రతింపులకై

న్యూఢిల్లీ, జూన్ 21

రుమేనియా సహాయంతో మన దేశంలో ఒక నూనె శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పే విషయమై సంప్రతింపులుజరపడంకోసం భారత ప్రభుత్వ ప్రతినిధులు నేటి ఉదయం బుఖారెస్టుకు బయలుదేరారు. ఈ నూనె శుద్ధి కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతారు. ప్రభుత్వ రంగంలో నెలకొనే 2 కర్మాగారాలలోనూ ఇది మొదటిది.

కేంద్ర ఉక్కు, గనులు, ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి, ఆర్థిక శాఖల ఉద్యోగులు ఈ ప్రతినిధి బృందంలో వున్నారు. ఇటీవల రుమేనియా ప్రధాని మన దేశం వచ్చినప్పుడు నూనెశుద్ధి కర్మాగారం నెలకొల్పడానికి తోడ్పడగలమని మాట ఇచ్చారు. అందుకు భారత ప్రభుత్వం అంగీకరించింది. రుమేనియా నిపుణులు ఇప్పుడు జ్వాలా ముఖిలో నూనెగనులున్నాయేమోనని పరిశోధనలు సాగించి భారత దేశానికి తోడ్పడుతున్నారు.

దీని విషయమై సంప్రతింపులకు రుమేనియా రావలసిందని రుమేనియా ప్రధాని స్టోయికా భారత గనుల మంత్రి శ్రీ కె. డి. మాలవీయను ఆహ్వానించారుకూడా. అవసరమని తోస్తే శ్రీ మాలవీయకూడా కొద్దిరోజుల్లో బుఖారెస్టు వెళతారు.

విళంబినామ సంవత్సర
చాంద్రమాన ఆషాఢమాసం
షష్ఠి ఉ॥ 6 – 3
సప్తమి తె॥ 3 – 40

విశాలాంధ్ర

సోమవారం 23-6-58
శకమాన ఆషాఢం 2–1880

కేరళలో ప్రతిపక్షం

"కేరళలో ప్రవర్తించినంత బాధ్యతా రహితంగా ప్రజాస్వామిక పాలనగల మరే రాష్ట్రంలోనైనా ప్రతిపక్షం ప్రవర్తించుతున్నదా అనేది సందేహాస్పదం. కమ్యూనిస్టు పార్టీ అధికారానికివస్తే దాన్ని తొలగించడం ఎన్నటికీ సాధ్యం గాదని ప్రతిపక్షం ఎల్లవేళలా ఆరోపిస్తూంటుంది. కేరళలో నిస్సందేహంగా ఆ విషయం రుజువయ్యేట్లున్నది. కమ్యూనిస్టుల స్థానం ఆక్రమించుకోవాలంటే అందుకు అర్హమైన ప్రతిపక్షం వుండాలి కాని కేరళలో ప్రతిపక్షం బలం రోజురోజుకూ సన్నగిలుతోంది. అధికారంలో లేకపోతే కాంగ్రెసు బాగుపడుతుందనుకున్న వారికి యిప్పుడు ఆశాభంగం కలుగుతోంది" అని అక్కడ ప్రతిపక్షం సాగిస్తున్న 'విముక్తి పోరాటం'పై "కేరళ కౌముది" వ్యాఖ్యానించింది. ఇది కమ్యూనిస్టు పత్రిక కాదు

"సంవత్సరంగా కాంగ్రెసు గాని, ప్రజాసోషలిస్టు పార్టీగాని తమ బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చడంలేదని నేను అభిప్రాయపడుతున్నాను. ఏదో ఒకవిధంగా అధికార పదవుల్లోకి ప్రవేశించాలనే వారు ప్రయత్నించారు. విచ్ఛిన్నకరమైన విమర్శలోనే వారు నిమగ్నులయ్యారు." అన్నాడు. ఒకప్పుడు కాంగ్రెసుకు, ప్రజాసోషలిస్టు పార్టీకి నాయకత్వం వహించిన పి. యస్. నటరాజపిళ్ళే.

కమ్యూనిస్టులవి కాని పత్రికలు, కమ్యూనిస్టు విరోధంగా వుండే పెద్దలు ఎందుకనవలసి వచ్చింది యీ మాటలు?

కేరళలో ఏర్పడిన మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వం గత ప్రభుత్వాలు చవిజూచిన అవినీతికి దూరంగా ఈ ప్రభుత్వం నిలిచింది. కేరళలో క్రొత్త పరిశ్రమల్ని అభివృద్ధి చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఆదాయాల్లో వ్యత్యాసాలు తగ్గించుతానని వాగ్దానం చేసిన కాంగ్రెసు ప్రభుత్వాలు కేంద్రంలోనూ 13 రాష్ట్రాల్లోనూ వాగ్దానభంగం చేస్తూంటే 14 వ రాష్ట్రంలో అసలు జరపడానికి ప్రయత్నిస్తోంది కమ్యూనిస్టు ప్రభుత్వం. అగ్రాన రూపాయలకు తక్కువ వెయ్యి రూపాయలకు ఎక్కువగాకుండ క్రిందినుంచి పైవరకు జీతాలు నిర్ణయించ బూనుకొన్నది ప్రణాళికా సంఘం వాగ్దానం చేసిన గృహ, కౌలుదార్లకు నిజంగా యిచ్చింది కేరళ ప్రభుత్వమే. కాంగ్రెసు ప్రభుత్వాలన్నీ ఏదో ఒక విధంగా భూసంస్కరణాలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ సూచనలను బుట్టదాఖలు చేస్తూంటే వాటిని నికరంగా అమలుపరచ బూనుకున్నది కేరళ ప్రభుత్వం. పేదల ఆదాయాన్ని పెంచుతామన్న "దాతలు" వారిపైననే పన్నులు దండిగా ఇతర చోట్ల తగిలించుతూంటే, పేదలపై భారం పడకుండా ఆదాయాలెక్కువవచ్చేవారిమీదికీ విదేశీ తోటలయజమానుల మీదికీ ఈబరువును కమ్యూనిస్టు మంత్రివర్గం నెట్టింది. బంజరుపొలాల్ని పేదలకు పంచడానికి చర్యలు తీసుకుంది. ఈ కార్యక్రమాలన్నింటినీ అవసరమైతే విమర్శించి, సూచనలిచ్చి, సహకరించమని ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులతో కలిపి సలహా సంఘాలను నియమించింది. శాసన సభలో బిల్లుల్ని ప్రవేశపెట్టబోయే ముందుగూడా ప్రతిపక్షాలవారితో అలా సంప్రదించడానికి తాను సిద్ధం అని ప్రకటించింది.

పంచవర్ష ప్రణాళికలోని మంచి ఆశయాలను అమలు జరపడానికి కేరళ ప్రభుత్వం కోరిన ఈ ఐక్యతనూ, చాచిన ఈ సహకార హస్తాన్నీ అక్కడి ప్రతిపక్షపార్టీలు తిరస్కరించాయి. రాజకీయ కక్షతో శ్రీ థానుపిళ్ళే స్పష్టంగా చెప్పినట్లు ఏదో ఒకవిధంగా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోయాని ప్రయత్నించాయి. గుడ్డి కమ్యూనిస్టువ్యతిరేకతనూ, ద్వేషాన్నీ రగుల్కొలిపి కయ్యానికి కాలుదువ్వుతున్నారు. "విముక్తి పోరాటం" నామకరణంచేసి అనుచిత సమస్యలపైన, అల్ప విషయాలపైన సత్యాగ్రహ సమరాలు సాగిస్తున్నారు. సీతారాంపురం మిల్లులో 5 గురి కార్మికుల్ని ఒక పనినుండి మరొక పనికి పురమాయించినందుకు మాజీ ముఖ్యమంత్రి పానంపిల్లి గోవిందమీనన్‌తో సహా సత్యాగ్రహం చేసి 536 మంది అరెస్టయ్యారు. ఇలాంటి కార్యకలాపాల్ని కొనసాగించేందుకే "కమ్యూనిస్టు వ్యతిరేక ప్రజాసంఘటన" పేరట కాంగ్రెస్, ప్రజాసోషలిస్టు, ముస్లింలీగ్ పార్టీలు ఒక కూటమిగా ఏర్పడ్డాయి. ఇది విచ్ఛిన్నకర ధోరణి; ఈ కూటమి అపవిత్ర కూటమి

కాంగ్రెసుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కూటములు ఏర్పరచుతున్నపుడు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా మిగతా పార్టీలు ఏకమైతే తప్పేమిటి అనే వాదనలు వినవస్తున్నాయి. కాని ఈ వాదన అర్థరహితం

అమృతసర్‌లో గాని అంతకు ముందు పాల్ఘాట్‌లో గాని కమ్యూనిస్టుపార్టీ గుడ్డి కాంగ్రెసు వ్యతిరేకతతో పంచవర్ష ప్రణాళికను వ్యతిరేకించలేదు. పంచవర్ష ప్రణాళిక మంచి ఆశయాలను ప్రకటించిందనీ ఆ ఆశయాలను నిజంగా అమల్లోకి తెచ్చే ప్రయత్నాలకు పూర్తి సహకారం యివ్వాలనీ కమ్యూనిస్టుపార్టీ నిర్ణయించింది.

కాంగ్రెసు ప్రభుత్వాలు తాము చెప్పినవి చేయడం లేదు గనుకనే కమ్యూనిస్టుపార్టీ వాటిని వ్యతిరేకించవలసివస్తుంది. పదేళ్లకు పైగా యీ దేశంపై గుత్తపెత్తనం కొనసాగిస్తూ అత్యంతవసరమైన జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని కాంగ్రెసు కొనసాగించలేకపోతున్నది. అందుకు ప్రజల్ని ఉత్సాహపరచలేకపోతున్నది.

ప్రణాళిక ప్రకటించిన జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని, భూసంస్కరణలనూ అమలు జరపడానికి ఇదమిద్ధమైన కార్యక్రమంతో ముందుకు వస్తున్న పార్టీలతో దేశమంతటా కమ్యూనిస్టుపార్టీ చేతులు కలుపుతోంది పునర్నిర్మాణ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు పూనుకున్న కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెసు కట్టే కూటమినీ, పునర్నిర్మాణ కార్యక్రమాన్ని నీరుగార్చుతున్న కాంగ్రెసు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మించే ఐక్యసంఘటననూ ఒకేగాటనకట్టటం హాస్యాస్పదం. కేరళలో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రతిపక్షబలం సన్నగిల్లడానికీ, దేశమంతటా కాంగ్రెసుకు వ్యతిరేకంగా యితర ప్రతిపక్షాల బలం నిత్యం పెంపొందడానికీ కారణం ఇదే.

కేరళలో విద్యా సంస్కరణలు

తిరువనంతపురం, జూన్ 21

ఈ సంవత్సరం విద్యారంగంలో కేరళ ప్రభుత్వం ఎన్నో మార్పులు తీసుకొని వస్తున్నది. కేరళ విద్యామంత్రి శ్రీ ముండస్సరి ఈ మార్పులను రూపొందించి అమలు జరపడానికై తీవ్రమైన కృషి చేస్తున్నారు.

మొదటిది ప్రాథమిక విద్యారంగంలో ఆధార విద్యా విధానం అమలు జరపాలని నిర్ణయించారు. తదనుగుణ్యంగా ఈఏడే 3400 ఉపాధ్యాయులకు ఆధార విద్యలో శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఆధార విద్యాబోధన పద్ధతులను, కేరళ మంత్రులు, ప్రధాన మంత్రి నెహ్రూరు, కేంద్ర విద్యామంత్రి శ్రీ మాలికి చూపించారు. ఈ పద్ధతులను వారు ఆమోదించారుకూడ.

ఒకటవ తరగతినుండి, మెట్రిక్యులేషన్‌వరకు గల తరగతులను పునర్వ్యవస్థీకరించారు. ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులు చేరడానికి ఉండవలసిన కనిష్ఠ వయఃపరిమితి 5 సంవత్సరాలనుండి 6 సంవత్సరాలకు పెంచారు. విద్యార్థి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యేటప్పటికి అతనికి 17 ఏళ్ళువుంటాయి. పాశ్చాత్య దేశాలంతటా ఇదే పద్ధతి అమల్లో ఉన్నది

పాఠశాలల్లో కొత్తపాఠ్యగ్రంథాలను ప్రవేశపెట్టారు ప్రభుత్వం నియమించిన ఓ కమిటీ చరిత్ర, భూగోళం మొదలగు వివిధ పాఠ్య విషయాలపై గ్రంథాలను ఎన్నుకొంది ఈ చరిత్ర గ్రంథాలు ఫ్రెంచి విప్లవం నుండి భారతదేశ స్వాతంత్ర్య సమరం, చైనా విప్లవం వరకుగల అన్ని విప్లవాలను గురించి వివరిస్తున్నాయి.

కేరళలో ప్రజాదరం మారగొన్న వైకోం, మొహమ్మద్, బివక్ ఆదిగాగల రచయితల గ్రంథాలను కూడ పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించారు. ఇక ఈ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందించే పద్ధతిలోకూడ మార్పు తెస్తారు. కేరళలో పాఠ్య పుస్తకాల ప్రతులు సుమారు 46 లక్షలు ఖర్చవుతాయి. వీటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా, విద్యార్థుల సహకార సంఘాల ద్వారా 11 వేల పాఠశాలలలోని విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేశారు. ఇందువల్ల ప్రభుత్వానికి 25–30 లక్షల రూపాయల ఆదాయం వస్తుందని అంచనా. ఈ పుస్తకాలు ప్రభుత్వం తన ముద్రణాలయాలలోనే అచ్చు వేయిస్తూ ఉంది.

ఇక పాఠశాలలలో చేరదలచుకున్న విద్యార్థికి సీటు దొరకదనే భయం లేదు పాఠశాలలో చేరదలచుకున్న విద్యార్థులకు ఏపరిస్థితులలోనూ సీటు నిరాకరించకూడదని ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

విద్యాశాఖలో కూడ పరిపాలనా వికేంద్రీకరణ సూత్రాన్ని అమలు జరుపుతున్నారు. పూర్వం విద్యాశాఖ కంతటికి ఒకే డైరెక్టరు ఏకచ్ఛత్రాధికారి ఉండేవాడు. ఇప్పుడు విద్యారంగంలోని ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క డైరెక్టరు నియమించారు. జిల్లా విద్యాధికారులకు ఇతోధిక అధికారాలిచ్చారు.

ఈ 15 నెలలలో మార్పులు జరగని శాఖంటూ విద్యారంగంలో లేదు. కేరళ విశ్వవిద్యాలయంలో ప్రాచీన, నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల వాతావరణం సృష్టిస్తున్నామని శ్రీ ముండస్సరి ప్రకటించారు.

కాని కేరళ ప్రభుత్వం ఎదుర్కోవలసిన చిక్కు సమస్యలుకూడ ఎన్నోవున్నాయి. కేరళ విద్యాబిల్లు అతీగతీ ఇంకా తేలలేదు. విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్‌నుండి కేరళ విశ్వవిద్యాలయానికి గ్రాంట్లు ఇంకా మంజూరు కాలేదు.

బెంగాల్‌లో పరిశ్రమల స్థాపనకు సోవియట్ సాయం

కలకత్తా, జూన్ 20

పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ ప్రాంతంలో మూడు పరిశ్రమలను స్థాపించటానికి సోవియట్ ప్రభుత్వం అంగీకరించిందని పశ్చిమ బెంగాల్ ప్రధాని డాక్టరు బి. సి. రాయి బెంగాల్ శాసనసభలో తెలియజేశారు. దుర్గాపూర్‌లో బ్రిటిష్ ప్రభుత్వం - ఒక ఉక్కు కర్మాగారాన్ని నిర్మిస్తున్న విషయం పాఠకులకు విదితమే.

సోవియట్ నిర్మించడానికి అంగీకరించిన మూడు కర్మాగారాలు ఇవి: బొగ్గును ఆవిరిచేసే కర్మాగారం, కోక్ కర్మాగారం, కళ్ళద్దాల ఫ్యాక్టరీ.

హైస్కూలు విద్యార్థుల ప్రమోషన్లు

నిబంధనలలో మార్పు

హైదరాబాదు, జూన్ 21

విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తులను పురస్కరించుకొని, విద్యాశాఖాధికారులు విద్యార్థుల ప్రమోషనులవిషయంలో నిబంధనలను కొంత సడలించారు. ఆంధ్రలో, 8 వఫారం వరకుగల విద్యార్థుల ప్రమోషనుల విషయంలో, ఆ యా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనుసరించవలసిన నిబంధనలను ప్రభుత్వం 57 లో జారీచేసింది.

ఈ నిబంధనలు చాలా కఠినంగా వున్నాయని, అనేకులు ప్రభుత్వానికి విన్నవించారు. అపై విద్యాశాఖ డైరెక్టరు ఈ నిబంధనలను కొంత మార్పుచేస్తూ మే 26 న ఒక ఉత్తర్వు జారీచేశారు. కాని అంతకుముందున్న నిబంధనల ప్రకారమే అనేక పాఠశాలలో విద్యార్థుల ప్రమోషన్ జరిగింది.

కాబట్టి, మే 26వ తేది ఉత్తర్వును అమలుజరిపి, దానిప్రకారం మళ్ళీ ఎవరెవరు పై తరగతులకు ప్రమోషన్ చేయవలసి వుంటుందో వారందరూ పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు ప్రకటించవలసిందిగా మళ్ళీ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

మే 26 వ తేది ఉత్తర్వు ప్రకారం హిందీలో నూటికి 10 మార్కులు వచ్చినా చాలు కిందటి వార్షిక పరీక్షలోని మార్కులేకాక, క్లాసు పరీక్షలు, అర్థసంవత్సరం పరీక్షలు మొదలగు పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులుకూడ పరిగణనలోనికి తీసుకోవాలని ఈ ఉత్తర్వులో ఉంది.

హైద్రాబాద్‌కు శ్రీమతి ఇందిరా గాంధీ రాక

జూలై 10 వ తేదీన

హైద్రాబాద్, జూన్ 21

హైద్రాబాదుకు 20 మైళ్ళ దూరంలో గల అంబాపురంలో జూలై 10 వ తేదీన శ్రీమతి ఇందిరా గాంధీ సంక్షేమ విస్తరణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

శ్రీమతి ఇందిరాగాంధీ హైద్రాబాద్‌లో కస్తూరిబా గ్రామసేవిక విద్యాలయాన్ని, అసిఫ్‌నగర్‌లోని కుటుంబ సంక్షేమ అగ్గిపెట్టెల కర్మాగారాన్ని సందర్శిస్తారు.

* * *

మైసూరులో ప్రజల కష్టాలను విచారించేపనిని ఉపమంత్రులకు అప్పగించామని ముఖ్యమంత్రి అంటున్నారు.

సోవియట్‌లో భూగర్భశాస్త్రం

ప్రొఫెసర్ మహదేవన్ పర్యటనానుభవాలు

వాల్టేరు, జూన్ 20

ఆంధ్ర విశ్వవిద్యాలయ భూగర్భ శాస్త్ర శాఖాధిపతి ప్రొఫెసర్ యస్. మహదేవన్ తన సోవియట్ దేశ పర్యటన అనుభవాలను గురించి ఇలా వ్రాస్తున్నారు:

అంత పెద్దభూగర్భ శాస్త్రజ్ఞుల సేనను సోవియట్ దేశం ఎలా తర్ఫీదు చేయగలిగింది? ఈ రహస్యాన్ని కనుగొనాలని నేను సోవియట్ దేశం వెడుతున్నప్పుడు అనుకొన్నాను. ఎందుకంటే ఇటీవలవరకూ భూగర్భ శాస్త్రజ్ఞుల విషయంలో ఆదర్శంగా వుంటూవచ్చిన అమెరికాలోకంటే చాల ఎక్కువమంది భూగర్భశాస్త్రజ్ఞులు సోవియట్ దేశంలో వున్నారు.

సోవియట్ శాస్త్రజ్ఞులు ఈ "రహస్యాన్ని" నా దగ్గర దాచిపెట్టలేదు. ఈ "రహస్యం" తెలుసుకునేందుకు వారు నాకు తోడ్పడ్డారు. నేను భూగర్భశాస్త్ర విజ్ఞాన సంస్థలనూ, విద్యాశాఖలనూ సందర్శించి, నిపుణులను తర్ఫీదు చేసే సోవియట్ పద్ధతులను తెలుసుకున్నాను. సోవియట్ దేశంలో భూగర్భశాస్త్రజ్ఞుల శిక్షణకు సోవియట్ ఆర్థికరంగ అవసరాలతో సన్నిహిత సంబంధమున్నట్టుగా నాకు తోస్తూంది.

జాతీయ ఆర్థికరంగ అవసరాలకూ విద్యావిధానానికీ మధ్య పూర్తిగా అన్యోన్య సంబంధముంది. సోవియట్ పరిశ్రమలు త్వరితగతిని వృద్ధి అవుతున్నాయి. కాబట్టి సుశిక్షిత భూగర్భశాస్త్రజ్ఞుల అవసరంకూడా ఎక్కువవుతుంది.

నేను చూసిన అనేక విషయాలను భారతదేశంలో ప్రయోజనకరంగా వుపయోగించుకో వచ్చును. సోవియట్ అనుభవం మాకు ఎంతో విలువైనది. దానిని మేము మరింత సమగ్రంగా తెలుసుకోవాలి. త్వరలో భారతీయ విద్యార్థులు భూగర్భసర్వే సంస్థల పనిలోనూ, సోవియట్ శాస్త్రజ్ఞులు మా విజ్ఞాన సంస్థల పనిలోనూ పాల్గొంటారని ఆశిస్తున్నాను.

వేకమిషన్ సిఫార్సులు వెలువడకముందే గోపాలరెడ్డి భయం

హైదరాబాదు, జూన్ 21

"కేంద్రప్రభుత్వం నియమించిన వేతనసంఘం నివేదిక ప్రకటిస్తే దానివల్ల రాష్ట్ర ప్రభుత్వోద్యోగులలో కలిగే పరిణామం ఎలాఉంటుందో యోచించడానికే నాకు భయంగా ఉన్నది" అని ఇక్కంటాక్సు శాఖోద్యోగుల వార్షిక సమావేశాన్ని ప్రారంభిస్తూ, కేంద్ర రివిన్యూ పౌర వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి అన్నారు.

"వేతనాలసంఘం కేంద్ర ప్రభుత్వోద్యోగుల జీతాలను హెచ్చించాలని సిఫార్సుచేసిన పక్షంలో, తమ జీతాలుకూడా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు చేస్తున్న ఆందోళనకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాతట్టుకొంటాయో నేను ఊహించలేకపోతున్నాను. ఇప్పటికే కేంద్ర రాష్ట్రోద్యోగుల మధ్య తేడా విపరీతంగా ఉన్న విషయం మనం కాదనలేము."

శ్రీ గోపాలరెడ్డి ఇతరులకన్న ఎక్కువ జీతాలు తీసుకొంటున్న కేంద్ర ప్రభుత్వోద్యోగులను బ్రాహ్మణులతోనూ, అందరికన్న తక్కువ జీతాలున్న స్థానిక సంస్థల ఉద్యోగులను హరిజనులతోనూ పోల్చారు.

దేశంలో ప్రభుత్వోద్యోగులు దేశ జనాభాలో నూటికి 5 పాళ్ళే వున్నారనీ, తక్కిన అశేష ప్రజాసామాన్యంయొక్క విద్యా వైద్య సౌకర్యాలను గురించికూడ ప్రభుత్వం ఆలోచించవలసి వుందని అన్నారు

ప్రభుత్వం పన్నులు పెంచి పెట్టుబడి పెట్టాలనేవారి ఉత్సాహాన్ని మొగ్గలో తుంచివేస్తున్నారని ఒక వర్గానికి కోపంగావున్న విషయం కూడ మరువరాదన్నారు.

"ఇప్పటికే పరిశ్రమాధిపతులపైన వ్యవసాయదారులపైన పన్నులభారం పెంచాం. మరి ప్రణాళికా పథకాలు అమలుజరపడానికై ఈ పన్నులు తప్పడంలేదు. ఉదాహరణకు 5–11 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలకు నిర్బంధ ప్రాథమికవిద్య అమలు జరపాలంటే 300 కోట్లు ఖర్చవుతుంది. కాబట్టి ఉద్యోగులు దేశపరిస్థితులుగమనించకుండా కేవలం తమ జీతం విషయమే ఆలోచించడం మంచిదికాదు" అని అన్నారు.

పన్ను బకాయీలు చెల్లించండి

వ్యాపారులకు గోపాలరెడ్డి అభ్యర్థన

గుంటూరు, జూన్ 21

రాబడిపన్ను బకాయీలు వసూలు చేయడంలో ప్రభుత్వోద్యోగులకు తోడ్పడవలసిందిగా కేంద్ర రివిన్యూ పౌరవ్యయ మంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి నేడు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.

గుంటూరు వాణిజ్యమండలివారు సమర్పించిన విజ్ఞాపన పత్రానికి సమాధానం చెప్పుతూ శ్రీ గోపాలరెడ్డి పై అభ్యర్థన చేశారు.

సంపదపై పన్నును రద్దుచేయాలని కల్డార్ కమిటీ నివేదిక సిఫార్సుల ప్రకారం రాబడిపన్ను విధించాలని, ఆంధ్రలో చిన్న రేవులను కేంద్రం అభివృద్ధిచేయాలని, దేశంలో పరిశ్రమలను స్థాపించడంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వాణిజ్యమండలివారు తమ విజ్ఞప్తిలో పేర్కొన్నారు. మంత్రి సమాధానం చెప్పుతూ సంపదపై పన్ను రద్దుచేయమని కోరడం న్యాయం కాదన్నారు.

రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అవసరమైన ధనం సమకూడనందువల్ల, ఆ ప్రణాళికా పథకాలు కొన్ని తృతీయ ప్రణాళికా కాలానికి వాయిదా పడవచ్చునని అన్నారు.

కేప్‌టౌన్, జూన్ 20

"మాలపల్లెచట్టం"వల్ల దక్షిణాఫ్రికాలోని భారతీయులు నానాటికీ చెప్పలేని దారిద్ర్యానికి గురవుతున్నారని, చివరకు వీరు కూలీలుగా మారేటందుకే ఈచట్టం ఉద్దేశించబడిందని దక్షిణాఫ్రికా భారతీయ కాంగ్రెసు అధ్యక్షుడు డాక్టర్ జి. ఎమ్. నాయకర్ నేడొక ప్రకటన చేశారు.

కోర్కెలు అంగీకరించేవరకు సమ్మె కొనసాగుతుంది

రేవు కార్మిక నాయకుడు శ్రీ మఖన్ ఛటర్జీ ప్రకటన

కలకత్తా, జూన్ 21

రేవు కార్మిక సమాఖ్య కనీసకోర్కెలను మన్నించడానికి తాము సంసిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం కార్యరూపేణ తెలియజేస్తేతప్ప రేవు కార్మికుల సమ్మె విరమించబడదని సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ మఖన్‌ఛటర్జీ నేడు పత్రికా సమావేశంలో చెప్పారు.

రేవు కార్మికుల కనీస కోర్కెలంటే ఏవో శ్రీ ఛటర్జీ ఇలా వివరించారు: ప్రావిడెంటుఫండు, గ్రాట్యుయిటీ, జీతాలస్కేళ్ళను గూర్చి చౌదరి కమిటీ తీర్పును ప్రభుత్వం అంగీకరించడం. (2) ఈ తీర్పును గత కాలానికి అన్వయించినందువల్ల కార్మికులకు రావలసిన డబ్బును చెల్లించడం. (3) కార్మికులకు స్థానికంగాగల సమస్యలను ఒక నిర్ణీత కాలంలో పరిష్కరించడం.

లోగడ కార్మికులకుగల అనుభవాన్నిబట్టి ప్రభుత్వం మాటలద్వారా కాక చేతలద్వారా కార్మికుల కోర్కెలను మన్నించనున్నట్టు తెలియజేయాలని కోరుతున్నామని శ్రీ ఛటర్జీ అన్నారు. ప్రభుత్వంతో చర్చించడానికి కార్మిక ప్రతినిధులు సర్వదా సిద్ధమేనని అన్నారు.

"కలకత్తాలో రెండు మూడు రోజుల్లో సమ్మె విరమించబడుతుందని అధికారులు కేంద్రరవాణా మంత్రికి తెలియజేశారని మాకు సమాచారమందింది. ఇలా సమ్మె విరమించబడుతుందని అనుకునేవారు, భ్రమలో ఉన్నారు" అని అన్నారు.

"రేవు అధికారులు రేవు కార్మికులు నివసించే ప్రాంతాలలో పాకీబళ్ళు, మంచినీటి లారీలు లేకుండా చేశారు. అందువల్ల కార్మికసమాఖ్య పాకీబళ్ళను, మంచినీటికై లారీలను సప్లయి చేయవలసిందిగా కలకత్తా మేయరును అభ్యర్థించింది. నిన్న రాత్రి పోలీసులు కార్మికుల యిళ్ళకు వెళ్ళి వారిని బెదిరించారు కూడా. ఈ విషయం వెంటనే ముఖ్యమంత్రి శ్రీ బి. సి. రాయ్‌కి తెలియజేశాం. పోలీసులు ఇటువంటి పనులుచేస్తే క్షమించనని ఆయన మాకు హామీ ఇచ్చారు."

మామూలుగా కలకత్తా రేవులో జరుగుతున్న పనిని బట్టి చూస్తే, జాతీయ వాలంటీరుదళాలు చేస్తున్న పని లెక్కలోనికి తీసుకోవలసింది కాదని శ్రీ ఛటర్జీ అన్నారు.

నేడు కలకత్తారేవును పత్రికల వారు స్వయంగా చూచివచ్చారు. ముడి మాంగనీసును ఓడకు ఎత్తుతున్న జాతీయ వాలంటీరుదళ సభ్యులు తప్ప, రేవులో ఒక్క కార్మికుడుకూడ వారికి కనుపించలేదు. జూన్ 16 వ తేదిన బయలుదేరవలసిన తన ఓడ ఇంతవరకు రేవు నుండి కదిలే అవకాశమే కనపడటంలేదని ఒక నావాధికారి విలేఖరులతో అన్నాడు. సమ్మెవల్ల తమకు కలిగిన ఇబ్బందులను ఏకరువు పెడుతూ, అనుభవంగల ఉద్యోగుల సహాయం లేనిదే నౌకలు హుగ్లీ నదిలో ప్రయాణం చేయడం ప్రమాదకరమని ఆయన అన్నారు.

కలకత్తా అధికారులు మాత్రం పరిస్థితి రోజురోజుకు మెరుగౌతున్నట్లు ప్రకటిస్తున్నారు.

విదేశీ స్వదేశీ నావా కంపెనీ ప్రతినిధులు నిన్న బొంబాయిలో సమావేశమై సమ్మెపరిస్థితిని చర్చించారని తెలుస్తున్నది.

బొంబాయి రేవువెలుపల వేలాది రేవు కార్మికులు కూర్చొని పికెట్ చేస్తూనే ఉన్నారు.

జాతీయ నావికోద్యోగుల సంఘం, రేవు కార్మికుల సమ్మెపోరాటాన్ని సంపూర్తిగా బలపరచాలని నిర్ణయించినట్లు తమకు తెలియజేసిందని నేడు సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ కులకర్ణి ప్రకటించారు. ఈ నావికోద్యోగులను రేవుల్లో వచ్చి పనిచేయమని అధికారులు ఎంత ఒత్తిడిపెట్టినా ఒక్కరు కూడా అలా రావడానికి అంగీకరించలేదని శ్రీ కులకర్ణి అన్నారు.

నేడు బొంబాయిలో రేవు కార్మికుల ప్రదర్శనలు జరిగాయి. సమ్మెను జూలై 17 వరకు కొనసాగించడానికి సిద్ధంగా వుండాలని నాయకులు కార్మికులను హెచ్చరించారు.

విశాఖపట్నం రేవులో సమ్మె యథాతథంగా సాగుతున్నది.

మద్రాసు రేవులో పరిస్థితి దిన దినానికి మెరుగౌతున్నదని రేవు అధికారులంటున్నారు. తాత్కాలికంగా నియమించిన కార్మికులు పనిలో చేరుతున్నారుకాని ఇతరులందరూ సమ్మెలో పాల్గొంటున్నారని రేవు ట్రస్టు అధ్యక్షుడు వెల్లడించారు.

ఏవిధమైన ప్రచారం లేకపోయినా, ఒక్క రేవు కార్మికుడు కూడా పనికి పోవడంలేదని కార్మిక నాయకులు ప్రకటించారు.

ఆహార నిల్వలు

హెచ్చుగానే వున్నాయని కేంద్ర మంత్రి

నైనిటాల్, జూన్ 20

ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా తట్టుకోడానికి వీలుగా అవసరమైనంత హెచ్చుగా ఆహారధాన్యాల నిల్వలు గలవని నేడిక్కడ కేంద్ర ఆహారమంత్రి శ్రీ అజిత్ ప్రసాద్ జెయిన్ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ అన్నారు.

ఇంతకుముందు కొన్ని సంవత్సరాలుగా లేనంత హెచ్చు ఆహార ధాన్యం నిలవలు ఇప్పుడు ప్రభుత్వం వద్ద వున్నాయని శ్రీ జెయిన్ చెప్పారు.

పరాంబికుళం జలాల పంపకం

కేరళ - మద్రాసు మంత్రుల సమావేశం

మద్రాసు, జూన్ 21

పరంబికుళం నదీ జలాలను మద్రాసు, కేరళ రాష్ట్రాలమధ్య పంచుకొనే విషయమై నేడు మద్రాసు కేరళ మంత్రుల మధ్య సంభాషణలు జరిగాయి.

సంభాషణలు ఒక గంటసేపు జరిగిన తరువాత కేరళమంత్రులతో [illegible] సమావేశం ప్రస్తుతానికి వాయిదా పడింది.

సంభాషణలు తిరిగి మరొకసారి కొనసాగించడానికి ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులు నిశ్చయించుకొన్నారు.

పరంబికుళం నది మద్రాసు రాష్ట్రంలోని కోయంబత్తూరుజిల్లా నుండి కేరళద్వారా అరేబియా సముద్రంలోకి ప్రవహిస్తుంది.

కేరళ ప్రభుత్వం అంగీకరించిన పక్షంలో కోయంబత్తూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల యకరాల సాగుకు పరాంబికుళం నదీజలాలను ఉపయోగించడానికి వీలుపడుతుంది.

ఈ విషయంలో కేరళలోనివివిధ రాజకీయ పార్టీలతో సంప్రతించవలసి వున్నదనీ, తమంతట తాముగా నిర్ణయం తీసుకోదలచలేదని కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ ఈ సమావేశంలో తెలిపారు. కేరళలో రాజకీయపార్టీల నాయకులను సంప్రతించిన పిమ్మట మరొకసారి సమావేశమవుదామని ఆయన చేసిన ప్రతిపాదనను మద్రాసు మంత్రులు అంగీకరించారు.

ఈ సమావేశంలో కేరళ తరఫున శ్రీ నంబూద్రిపాద్, ఇరిగేషన్ మంత్రి శ్రీ వి. ఆర్. కృష్ణయ్యర్ కేరళ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శ్రీ యస్. ఇ యస్. రాఘవాచారి పాల్గొన్నారు.

మద్రాసు తరఫున ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్, హోంమంత్రి భక్తవత్సలం, ఆర్థికమంత్రి సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్‌మంత్రి కక్కన్, ఇతర అధికారులూ పాల్గొన్నారు.

సమావేశానంతరం శ్రీ నంబూద్రిపాద్ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ఉభయరాష్ట్రాలమధ్య నదీజలాల పంపకం విషయంలో వున్న అనిశ్చిత పరిస్థితి త్వరలోనే తొలగిపోగలదనే ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

తన అవసరాలు గడిచిన తరువాత మద్రాసు రాష్ట్రానికి ఎంత నీటిని సరఫరా చేయగలమనేదే మొట్టమొదటనుండి కేరళకుగల సమస్య అని ఆయనన్నారు. ఈ విషయంలో కేరళలోని వివిధ రాజకీయ పార్టీల మధ్య కొద్దిగా అభిప్రాయభేదాలున్నాయనీ, అందువలన ఏకాభిప్రాయానికి రావడానికి తాము మరికొంత వ్యవధిని తీసుకోదలచామని ఆయన వివరించారు.

బీహార్ రాష్ట్రంలో తొలకరి

పాట్నా, జూన్ 20

గత 6 వారాలుగా పాట్నా తదితర ప్రాంతాలలో వడగాడ్పులు తీవ్రంగా వుండి, ఎన్నో ప్రాణాలు పోయాయి. నేటి వుదయంమాత్రమే ఒక గంటసేపు వాన తుంపరలు పడ్డాయి.

గత మూడురోజులుగా దర్భంగా చంపారన్ మొదలైన ప్రాంతాలలో భారీఎత్తున వర్షాలుపడ్డాయి.

ఇదే సమయంలో, సాహబాద్ జిల్లాలో వడదెబ్బ తగిలి 50 మంది చనిపోయారని, జూన్ 18వ తేదీన బక్సర్ ప్రాంతంలో చనిపోయినవారిసంఖ్య 42 మంది అని వార్తలు తెలుపుతున్నాయి.

ఢిల్లీలో నలుగురిమరణం

ఢిల్లీలో నేడు వడదెబ్బ తగిలి మరో నలుగురు వ్యక్తులు చనిపోయారు. దీనితో ఢిల్లీలో వడదెబ్బ వల్ల చనిపోయినవారి సంఖ్య 31 కు చేరుకున్నది. ఇక్కడ ఉష్ణోగ్రత 109 డిగ్రీల వరకు వుంటోంది.

ఉత్తర ప్రదేశ్‌లో

ఉత్తర ప్రదేశ్‌లో వడగాల్పుల వల్ల చనిపోయిన వారి సంఖ్య నేటికి 118 కి చేరుకున్నట్లు రాష్ట్రంలోని పలుప్రాంతాల నుండి వస్తున్న వార్తలు తెలుపుతున్నాయి. అన్ని ప్రదేశాలలో కన్నా కాన్పూర్‌లోనే ఎక్కువ చనిపోయారని తెలుస్తూంది.

రాష్ట్రేతరాంధ్రులకు విద్యాసౌకర్యాలు

రాజ్యాంగ చట్టరీత్యా ఇతోధికంగా కల్గించాలని ఆంధ్ర మహాసభ వినతి

ఖర్గపురం, జూన్ 15

రాష్ట్రేతర ఆంధ్రమహాసభ జనరల్ కౌన్సిల్ సమావేశం మేనెల మూడవవారంలో ఖర్గపురంలో శ్రీ సి. వామనమూర్తిగారి అధ్యక్షతను జరిగింది. ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బొంబాయి రాష్ట్రాలనుండి ప్రతినిధులు వచ్చారు.

వివిధ రాష్ట్రాలలో నివసిస్తున్న ఆంధ్రుల భాష, సంస్కృతి రక్షణల గురించి సమావేశంవారు చర్చించారు. పశ్చిమ బెంగాల్‌లోని టిటాఘర్ జూట్‌మిల్లు మూసివేయడం వలన అక్కడ ఉన్న వేలాది తెలుగువారికి నిరుద్యోగ సమస్య ఏర్పడింది. టిటాఘర్ ఆంధ్రుల పునరావాస సమస్యను పరిశీలించి బెంగాల్, ఆంధ్ర ప్రభుత్వాల వద్దకు రాయబారం వెళ్ళడానికి సమావేశంవారు ఒక ఉపసంఘాన్ని నియమించారు.

ఆనేక రాష్ట్రాలలో తెలుగు బాలబాలికలకు వారి మాతృభాషలో విద్యాసౌకర్యాలు ఆయా ప్రభుత్వాలు కల్పించడంలేదని ప్రతినిధులు తెలియజేశారు. రాజ్యాంగ చట్టంలో మైనారిటీ భాషలవారికి యివ్వబడిన రక్షణలు లోపించుతున్నాయనీ వీరు తెలిపారు. ఖర్గపురంలోని ఆంధ్ర హైస్కూలులో సెకండరీ విద్యను తెలుగులో బోధింపజేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సమావేశంవారు అర్థించారు.

వివిధ రైల్వే కాలనీలలో తెలుగు పిల్లల విద్యాసౌకర్యాల గురించి విచారణ జరుపుటకు రైల్వేబోర్డువారు ఒక కమిటీని నియమించాలనీ, తగు సౌకర్యాలు కల్గించుటకు చర్యలు తీసుకోవాలనీ కోరారు.

మైనారిటీ భాషలవారికి యివ్వబడిన చట్టబద్ధ రక్షణలు అమలు జరిపించేటట్లుగా కేంద్రప్రభుత్వ మైనారిటీ భాషల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరారు.

నూతన కార్యవర్గానికి శ్రీ సి. వామనమూర్తిగారిని అధ్యక్షులుగాను, శ్రీ ఎమ్. వి. రమణరావు (ఢిల్లీ) శ్రీ ఎన్. సి. ఎస్. ఆచార్య (బొంబాయి) శ్రీ కె. తిరుమలరావు (టాటా) గార్లను ఉపాధ్యక్షులుగాను, శ్రీ ఆత్మారాం (ఖర్గపురం) గారిని ప్రధాన కార్యదర్శిగాను, శ్రీ జె. వి. రమణమూర్తి (బరంపురం) శ్రీ కె. వి. గోపాలరత్నం (ఢిల్లీ) గార్లను సహాయ కార్యదర్శులుగాను శ్రీ ఎస్. ఆర్. దాసు (ఖర్గపురం) గారిని కోశాధిపతిగాను మరి 17 మందిని కార్యవర్గ సభ్యులుగాను ఎన్నుకొన్నారు.

ఉద్యోగుల మద్దతుతో కంట్రాక్టరు దౌర్జన్యం

రాజమండ్రి, జూన్ 18

చింతూరురోడ్డు ప్రక్కన ఉన్న కలపను ఫారెస్టు కంట్రాక్టరు శ్రీ దోసేపూడి వెంకట్రామయ్యగారు ఈనెల 8వ తేదీన అనుమతిలేకుండా తీసుకొని పోతూండగా బీటు ఫారెస్టుగార్డు బోరిల సత్యనారాయణగారు అటకాయించారు. అంతట వెంకట్రామయ్యగారు "నీవు నాపనిని అడ్డుకొనువాడవా?, అని కాలిచెప్పు తీసి కొట్టాడు. గోకవరం ఫారెస్టు రేంజరు, చోడవరం సెక్షన్ ఫారెస్టరు గార్లుకూడా అక్కడే ఉన్నారు. అనుమతిలేకుండా వెంకట్రామయ్యగారు కలప తీసుకొని పోతుండగా ఈ అధికారులు అడ్డుపెట్టలేదు సరికదా క్రింది ఉద్యోగిపై కంట్రాక్టరు దౌర్జన్యం చేస్తున్నా మాట్లాడలేదు. గత 8 మాసములుగా ఈ కంట్రాక్టరు మారేడుమిల్లు ఉత్తర జోన్‌లోని అడవులను అక్రమంగా నరికి కలప తీసుకొని పోతూండగా ఆ ప్రాంతవాసులు పై అధికార్లకు తెలియపరచి దాదాపు వెయ్యి మానులను అపుచేశారు. కాని ఉద్యోగస్తుల మద్దతుతో ఈ కాంట్రాక్టరు కలపను తోలించుకుపోయాడు.

* * *

దామరగిద్ద (మహబూబ్‌నగర్) యువజనసంఘంవారు ఇటీవల "నేటి న్యాయం" అను నాటకాన్ని ప్రదర్శించారు.

తెలుగు, కన్నడములకు ఏకలిపి

కన్నడసాహిత్యపరిషత్తువారి యాజమాన్యాన చర్చాగోష్ఠి

బెంగుళూరు, జూన్ 14

కన్నడ సాహిత్య పరిషత్తువారు ఏర్పాటుచేసిన వసంత సాహిత్యోత్సవముల అంగముగా "ఆంధ్ర కర్ణాటక భాషలకు ఏకలిపి ఆవశ్యకత"ను గూర్చి చర్చించడానికి ఒకవిద్వద్గోష్ఠి ఈనెల 21వ తేదీన మైసూరుప్రభుత్వ ఆర్థికశాఖామంత్రి శ్రీ టి. మరియప్ప (బి. ఏ., ఎల్. ఎల్. బి.,) గారి అధ్యక్షతను ఏర్పాటు చేయబడింది. ఆంధ్రదేశంనుండి నానా విద్వాంసులను ఆహ్వానించారు.

మైసూరు విశ్వవిద్యాలయ కన్నడ భాషా శాఖాధ్యక్షులయిన ప్రొఫెసర్ టి. ఎన్. శ్రీకంఠయ్య, తెలుగు భాషా శాఖాధ్యక్షులు శ్రీ కె. సుబ్బరామప్ప, కన్నడ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ కె. వెంకటరామప్పగార్లు తదితరులు పాల్గొంటారు.

పరిషత్తుఅధ్యక్షులు పండితరత్నం, ఆస్థాన విద్వాన్ శ్రీ బి. శివమూర్తి శాస్త్రులుగారు స్వాగతోపన్యాసం గావిస్తారు.

శ్రీ కె. సుబ్బరామప్పగారు ఏకలిపి సాధ్యతనుగూర్చి తయారుచేసిన హస్తప్రతిని పరిషత్తువారు కన్నడంలో అచ్చువేసి అభిప్రాయార్థం పెద్దలకును, పత్రికలవారికిని పంపించారు.

ధరల స్థిరీకరణబోర్డు

అఖిలభారత కిసాన్‌సభ కార్యదర్శి ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 15

అఖిలభారత కిసాన్‌సభ కార్యదర్శి శ్రీ నండూరి ప్రసాదరావుగారు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు.

ధరల స్థిరీకరణబోర్డు ఆహార ధాన్యాల స్థిరీకరణ సంస్థలను నెలకొల్పాలని ఆహారధాన్యాల విచారణ కమిటీ చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం శోచనీయం. కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శులను ఒక కమిటీగా వేసినంత మాత్రంచేత అది ధరల స్థిరీకరణ బోర్డుకు ప్రత్యామ్నాయం కాజాలదు. బోర్డు నిర్వర్తించగలిగిన అనేక పనులను ఇది నిర్వర్తించలేదు. ధరల స్థిరీకరణ విషయం చాలా జాగ్రత్తగా చూడవలసిఉంది. ఒక ప్రత్యేక బోర్డు అందుకు అవసరం కూడా. ఆవిధంగా ఆహార ధాన్యాల స్థిరీకరణసంస్థ ఏర్పరచడానికి బదులు కేంద్ర ప్రభుత్వ మార్కెటింగ్ ఆఫీసరుకే ఆపనిఅప్పగించారు. కొద్ది సంవత్సరాల అనుభవంలోనే ఈ విషయం తేటతెల్లమైంది. ఈవిధంగా ఆహార ధాన్యాల విచారణ కమిటీ ప్రధాన సిఫారసులను ప్రభుత్వం త్రోసిపుచ్చడం ప్రభుత్వ కార్యక్రమాలను మందకొడిగా తయారుచేస్తుంది. ఈ విషయం పార్లమెంటులో చర్చించాలనీ సరియైన నిర్ణయాలు తీసుకోవాలనీ ఆశిస్తున్నాము.

కేంద్ర ఆహార సలహా సమితిని ఏర్పాటుచేయాలన్న సిఫారసునైనా ప్రభుత్వం అంగీకరించడం సంతోషించతగ్గ విషయం. ఈ సమితినైనా సక్రమంగా ఏర్పాటు చేయాలనీ, రైతాంగ ప్రయోజనాలకు సరియైన ప్రాతినిధ్యం ఇవ్వాలనీ ఆశిస్తున్నాం. ఈ సమితిని సాధ్యమైనంత వెంటనే ఏర్పాటుచేయాలని కూడా కోరుతున్నాము.

నెల్లూరులో హిందీ విద్యాలయం

నెల్లూరు, జూన్ 20

దక్షిణభారత హిందీ ప్రచారసభ ఆంధ్రశాఖ యాజమాన్యమున 58 సెప్టెంబరు నెలనుండి నెల్లూరు పట్టణంలో హిందీ మహావిద్యాలయమును నడిపించుటకు నిర్ణయించబడినది. దక్షిణభారత హిందీ ప్రచారసభ ఆంధ్రశాఖవారు ఈ సంవత్సరం నడపదలచిన విద్యాలయాలలో ఇది ఎనిమిదవ విద్యాలయం.

నూజివీడు అగ్ని బాధితులకు సహాయం

కమ్యూనిస్టుపార్టీ కృషి

నూజివీడు, జూన్ 20

నూజివీడు అగ్ని బాధితుల సహాయార్థం తాలూకా కమ్యూనిస్టు కార్యాలయానికి చేరిన నిధి పంపకం నేటి ఉదయంనుండి ప్రారంభమయ్యింది. కమ్యూనిస్టు కార్యకర్తలు యితర స్థానిక మిత్రులు తోడ్పాటుతో రాత్రి 8 గంటలవరకు పంపక కార్యక్రమాన్ని సాగించారు. ఇప్పటికి మొత్తం 450 కుటుంబాలకు 450 మానికల బియ్యం, 45 బళ్ళగడ్డి, కొన్ని బట్టలు పంచారు. ఈ పంపక కార్యక్రమం రేపుకూడా సాగించబడుతుంది. ఇప్పటికి మొత్తం 24 గ్రామాలలో 24 బస్తాల బియ్యం, 12 బస్తాల ధాన్యం, 1250 గుడ్డలు, 75 బళ్ళగడ్డి వసూలయ్యింది.

గ్రామాలలో వసూళ్లు

అగ్ని బాధితుల సహాయనిధికి వసూళ్ల నిమిత్తం నూజివీడు తాలూకా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ దాసరి నాగభూషణరావు, గుడివాడ తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ బి. వి. రావు, పాతూరి వెంకటేశ్వరరావు (అగిరిపల్లి) వంగపాటి రంగారెడ్డి (బొన్నపాడు), వింత వెంకటరెడ్డి (తేలప్రోలు), ఉప్పాలేటి ప్రసాదరావు, అవిర్నేని సోమయ్య (నూజివీడుతాలూకాకమిటీ సభ్యులు) సూరపనేని సుబ్రహ్మణ్యం (ఉంగుటూరు) కల్లూరిపల్లి కాశీవిశ్వేశ్వరరావు (అంపాపురం)గార్లు ఈనెల 14వ తేదీనుండి 18 వరకు వివిధ గ్రామాలు పర్యటించారు. బొన్నపాడు, నందివాడ, న్యాయుగూడెం, పెదపాడు, ఓగిరాల, తిప్పనగుంట, చిరివాడ, తేలప్రోలు, గారపాడు, కొయ్యగూరప్పాడు, అముదాలపల్లి, వుంగుటూరు, వెల్దిపాడు, ఇందుపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, అంపాపురం, వీరవల్లి, వగైరా గ్రామాల్లో పెద్దలను యువకులనుకలుసుకొని గడ్డి, ధాన్యం, రొఖం వసూలుచేశారు. విరివిగా విరాళాలుయిచ్చి నూజివీడు అగ్ని బాధితులకు తమ సానుభూతిని ప్రకటించారు.

గుంటుపల్లిలో అగ్ని ప్రమాదం

విజయవాడ, జూన్ 20

విజయవాడ తాలూకా గుంటుపల్లిలో ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. గడ్డి వాములు, ధాన్యం, అపరాలు, వస్త్రాలు నష్టమయ్యాయి. మొత్తం మూడు వేల రూ.లు నష్టంఉంటుంది. వీరందరూ నిరుపేదలు. ప్రభుత్వం తగు సహాయం చేయాలని కోరుతున్నారు.

రాజమండ్రిలో

రాజమండ్రిలో 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు 12వ వార్డు మఠం వీధిలో 17 యిండ్లు కాలిపోయాయి. ఈ అగ్ని బాధితులకు సాయంత్రం శ్రీ ఆకెపు నాగరాజుగారు భోజనసదుపాయాలు చేశారు. కమ్యూనిస్టు కార్యకర్తలు ధనము, వస్తుసామాగ్రి వసూలు చేసి యిచ్చారు.

సభలు సమావేశాలు

పశ్చిమ గోదావరిజిల్లా పోలవరం తాలూకా రైతుప్రతినిధుల సమావేశం ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు పోలవరం (జగన్నాథరావు పేట)లో జరుగుతుంది. ఈ సమావేశానికి శ్రీ ఉద్దరాజు రామం (ఎం. పి.) ఇతర జిల్లా రైతునాయకులు హాజరవుతున్నారు.

◆ ◆ ◆

ఆంధ్రప్రదేశ్ అగ్నికులక్షత్రియ సంఘ కార్యవర్గ సమావేశం జూన్ 29వ తేదీ ఉదయం 7 గంటలకు మారుతీ టింబరు డిపో, విజయవాడలో జరుగుతుంది.

◆ ◆ ◆

ఖమ్మంజిల్లా వైరాలో శ్రీ అక్కినేని నాగేశ్వరరావు బాలురహాస్టల్ ఈనెల 28వ తేదీన తిరిగి తెరువబడుతుంది. ఈ సంవత్సరం 30 మంది వెనుకబడినజాతుల బాలురను చేర్చుకుంటారు.

◆ ◆ ◆

ప్రస్తుతం సడలించబడుతూన్న కర్ఫ్యూ నిబంధనల్ని సిలోన్ ప్రభుత్వం జూలై ఆఖరుకి తిరిగి విధిస్తుందని తెలుస్తుంది.

జూన్ 27వ తేదీన ప్రభుత్వ పనివారల కోర్కెల దినం

జరపాలని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి

విజయవాడ, జూన్ 20

జూన్ 27వ తేదీన ప్రభుత్వ పనివారల కోర్కెల దినం జరుపవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. ఎల్. నరసింహంగారు విజ్ఞప్తి చేశారు.

విజ్ఞప్తిలో ఇలా తెలియజేశారు:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిపార్టుమెంటుల పనివారు (పి. డబ్ల్యు. డి. వర్కుషాపు కార్మికులు, హైవేసు పనివారలు, ఎలక్ట్రిసిటీ పనివారలు, హాస్పిటల్ పనివారలు మొదలైనవారు) చాలసంవత్సరాలుగా జీతాల పెంపుదలకొరకు ఆందోళన చేస్తున్నారు. అనేకసార్లు విడివిడిగా వివిధరూపాలలో పోరాటాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణతో ఒకే డిపార్టుమెంటులో పనిచేసే వారిలో ప్రాంతాలవారీగా వున్న జీతాల తేడాలను సరిచేసి, అందరికీ నూతన స్కేళ్ళు అమలు జరిపి, జీతాలలో పెంపుదల ఇవ్వవలసిందిగా కోరటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్మికుల కోర్కెలను పరిష్కరించుటకు ఎట్టి చర్యా తీసుకోలేదు. కార్మికవ్యతిరేక ధోరణితో, కార్మిక సంఘాల విన్నపాలు, తీర్మానాలను నిర్లక్ష్య భావంతో చూడటం జరిగింది.

తెలంగాణా ప్రాంతంలోని కార్మికులు చాలా సంవత్సరాలుగా సాగించిన పోరాట ఫలితంగా ప్రభుత్వం అనేక కమిటీలను నియమించి వారిపరిస్థితులను పరిశీలించింది. రిగే కమిటీ సిఫార్సులను ప్రభుత్వం లెక్కచేయలేదు. ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో మరల హనుమంతరావు కమిటీని నియమించి పరిశీలించింది. ఆ హనుమంతరావు కమిటీ రిపోర్టునుకూడా ఇంతవరకు ప్రభుత్వం ప్రకటించి, దానిని అమలుపరచలేదు. ఈ విషయంలో అసెంబ్లీ బడ్జెటు సమావేశంలోచేసిన వాగ్దానం కూడా ఇంతవరకు అమలుపరచలేదు. హనుమంతరావు కమిటీ చేసిన జీతాల పెంపుదల సిఫార్సులను ప్రభుత్వం అమలు జరుపుటకు నిరాకరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రు. 100/-లోపు జీతం తీసుకునే ప్రభుత్వ పనివారలకు అదనపు కరువుభత్యంగా 1 ఏప్రల్ 1957 నుంచి 6/- రూపాయలు ఇవ్వాలని జీ. వో. ప్రకటించినా అందరికీ దానినిఅమలు జరుపలేదు. హైద్రాబాదులో కొన్ని నెలలుఇచ్చి ఆపారు. పి. డబ్ల్యు. డి.-హైవేసు కార్మికులకు ఇంతవరకు ఇవ్వలేదు. ఆంధ్ర ప్రాంతంలో ఎలక్ట్రిసిటీ పనివారలలో కొందరికి మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వ పనివారలలో నూటికి 90 మందికిఅదనపు కరువుభత్యం ఇవ్వలేదు. ఈవిధంగా ప్రభుత్వం తానుచేసిన వాగ్దానాలను, జీ. వో. లను అమలుజరుప నిరాకరిస్తున్నది.

ఈ పరిస్థితులలో హైదరాబాదులో మార్చి 16వ తేదీన జరిగిన ప్రభుత్వ పనివారల ఐక్య మహాసభలో జూన్ 27వ తేదీన రాష్ట్రవ్యాపిత సమ్మె చేయాలని తీర్మానించి పోరాట కమిటీని ఎన్నుకున్నారు. ఆ పోరాట కమిటీ తరఫున పంపిన తీర్మానాలకు ప్రభుత్వం ఇంతవరకు ఎట్టి సమాధానం ఇవ్వలేదు. ఆ మహాసభలో హనుమంతరావు కమిటీ సిఫార్సులు అమలు జరపాలని, అందరికీ రు 6/-లు అదనపు కరువుభత్యంగా ఇవ్వాలని, ఇంకొక రు 6/లు సిటీ ఎలవెన్సుగా ఇవ్వాలనీ, పేకమిషన్ నియమించిన నూతన జీతాలు నిర్ణయించాలని కోరారు. కాని ప్రభుత్వం 'పేకమిటీ'ని నియమించినా అది కార్మికుల జీతాల విషయం పరిశీలించదని ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల రాష్ట్రవ్యాపిత ఐక్య పోరాటానికి కార్మికులు సంసిద్ధం కావటం తప్ప గత్యంతరంలేదు. అన్ని కేంద్ర కార్మిక సంస్థలకు అనుబంధించబడిన కార్మిక సంఘాలు, స్వతంత్రసంఘాలు కలిసి ఏర్పాటుచేసుకున్న పోరాటకమిటీ జూన్ 5వ తేదీన సమావేశమై కొన్ని కార్మికసంఘాలు సమ్మె పోరాటానికి వ్యవధి కావాలని కోరినందున జూన్ 27వ తేదీన కోర్కెల దినోత్సవం జరిపి జూలై 6వ తేదీన జరిగే అన్ని యూనియన్ల ప్రతినిధుల సమావేశంలో ముందు కార్యక్రమం నిర్ణయించుకోవాలని తీర్మానించుకున్నారు.

కాబట్టి రాష్ట్రవ్యాపితంగా జూన్ 27వ తేదీన ప్రభుత్వ పనివారల కోర్కెలదినం జరపండి. ఆరోజున ప్రతి పట్టణంలో కార్మిక సంఘాలన్నీ కలిసి ఐక్యప్రదర్శనలు జరపవలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాను. ఐక్యపోరాటం సాగించుటకు ప్రతి పట్టణంలో ఐక్య కమిటీలను ఏర్పాటు చేయవలసిందిగా హెచ్. ఎం. ఎస్.-ఎ.ఐ.టి.యు.సి. రాష్ట్రకమిటీలువిజ్ఞప్తి చేస్తున్నాయి. ఐక్యంగా నిర్ణయించిన ఈ పిలుపును అందుకొని, కార్మికులందరూ జూన్ 27వ తేదీన ఐక్యప్రదర్శనలు జరిపి, ప్రభుత్వానికి తమ కనీస కోర్కెలు అందజేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఖమ్మంజిల్లా రైతు సంఘ సమావేశం

భూసంస్కరణలకోసం ఆందోళనజరప నిర్ణయం

ఖమ్మంమెట్టు, జూన్ 17

ఖమ్మంజిల్లా రైతుసంఘ కార్యవర్గ సమావేశం యీనెల 14వ తేదీన జిల్లా రైతుసంఘాధ్యక్షులు శ్రీ కర్నాటి కృష్ణయ్యగారి అధ్యక్షతన ఇచ్చటి సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు శ్రీ వీరమాచనేని ప్రసాదరావుగారు పాల్గొన్నారు.

ఇటీవల వైరాలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతుమహాసభ గావించిన తీర్మానాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ సహాయ కార్యదర్శి, శాసన సభ్యులు అయిన శ్రీ క. యల్. నరసింహారావుగారువివరిస్తూ వాటిలో ముఖ్యంగా భూసంస్కరణలగురించి గావించిన తీర్మానంపై మాట్లాడారు. రైతులమధ్య ఐక్యతను నెలకొల్పాలనీ, అన్ని వర్గాలవారిని కూడగట్టుకొని రావడానికి ప్రయత్నించి ప్రభుత్వం తేదలచిన భూసంస్కరణల చట్టస్వరూపాన్ని అభివృద్ధికరంగా మార్పించాలనీ, ఇందుకు గ్రామగ్రామానా సభలు, సమావేశాలు జరపాలన్నారు.

శ్రీ వీరమాచనేని ప్రసాదరావుగారు మాట్లాడుతూ, యీ ప్రభుత్వం తేదలచిన భూసంస్కరణల చట్టం వల్ల రైతుకు, కౌలుదారుకు వున్న భూమి ఊడిపోయే ప్రమాదం వుందనీ, ప్రజలంతా కదిలి ఒక్కుమ్మడిగా అడ్డుకుంటేగాని యీ ప్రభుత్వం వెనుతిరిగి చూడదనీ అన్నారు. అందుకు తగు ఆందోళన జరపాలన్నారు.

వెంటనే అన్నితాలూకాల రైతు సంఘ సమావేశాలు ఏర్పాటు చేయాలని, భూసంస్కరణల గురించిన ఆందోళనను వెంటనే కొనసాగించాలని, అన్ని ఫిర్కాలలో సభలు, సమావేశాలు, ప్రదర్శనాలు జరిపి జూలై నెల మొదటి వారంలో ఖమ్మంలో ఒక పెద్ద రైతు ప్రదర్శనం జరపాలని నిర్ణయించారు.

ఈ సంవత్సరం ఆగష్టు నెలాఖరు వరకు జిల్లాలోని అన్ని తాలూకాలలో 18 వేల రైతుసంఘ సభ్యత్వం చేర్పించాలని నిర్ణయించారు. అప్పటి కప్పుడే ఖమ్మం తాలూకావారు 4 వేలు, మధిర 4 వేలు, యిల్లెందు 2 వేలు, బూర్గంపాడు 2 వేలు, పాల్వంచ మరో వేయి సభ్యత్వం చేర్పించేందుకు కోటాలు తీసుకున్నారు.

బంచరాయి మొదలగు ప్రభుత్వ భూములపైన యీ సంవత్సరం వేసిన అధిక తావాన్లు రద్దు చేయాలని మరో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని వివరించేందుకు కలెక్టరువద్దకు జిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి వి. వెంకటపతి, రాజ్యసభ సభ్యులు వీరమాచనేని ప్రసాదరావుగార్లను రాయబార కమిటీగా నియమించారు.

తావాన్ల విధింపు ఆపుచేయాలి

ఖమ్మంజిల్లా కలెక్టరు వద్దకు రాయబారం

ఖమ్మం, జూన్ 17

ఖమ్మంజిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి శ్రీ వాసిరెడ్డి వెంకటపతి, రాజ్యసభసభ్యులు శ్రీ వీరమాచనేని ప్రసాదరావుగారలు ఈ నెల 15వ తేదీన జిల్లాకలెక్టరును కలుసుకొని అన్నిరకాలైన తావానులను అపుజేయాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు.

అందులో వారు యిల్లా కోరారు:

(1) అన్నిరకములైన తావానులను వెంటనే అపుదలచేయాలి. (2) తావానులు రద్దు చేయవలసిందిగా రైతులు అప్పీలుచేసుకొనే గడువు పొడిగించాలి. (3) అధికోత్పత్తి దృష్ట్యా యిప్పటివరకు ప్రభుత్వ భూములైన బంచరాయి, సర్కార్ వగయిరా లావునీ భూములను సాగుచేస్తున్న సాగుదార్లకు పట్టా హక్కులు కల్గిస్తూ అట్టి భూములపై తావానులు రద్దు చేయాలి, (4) ప్రాజెక్టులక్రింద, మాగాణీ ఆయకట్టుక్రింద కల్పబడి నీటిపారుదలకు అవకాశము లేక మిగిలిన మెరక భూములను మాగాణీ ఆయకట్టునుంచి మినహాయించి, యీ సంవత్సరము విధించిన మాగాణీశిస్తు తావానులను రద్దుచేస్తూ మెరకశిస్తుమాత్రమే వసూలు చేయాలి (5) గ్రామ ఉమ్మడి పట్టా బీటి భూములపై విధించబడిన తావానులు రద్దుచేయాలి, (6) జిల్లాలోమార్చి కట్టబడిన గ్రామాల యిండ్లస్థలములపై విధించిన నిస్తుతావానులు రద్దుచేసి అట్టిగ్రామాలను ఆబాదీలలో చేర్చాలి.

కలెక్టర్ సావధానంగా విని తనకువున్న అధికారాలన్నిటినీ వినియోగించి రైతులకు మేలుగలిగేట్టుగా చూస్తాననీ, తావాన్లు విధించబడినవారందరిచేత విడివిడిగా అప్పీలు చేయించమనీ, వాటిని సానుభూతితో విచారిస్తాననీ, తతిమ్మావిషయాలు మెమోరాండంలో వున్నవన్నీ యథార్థాలని అంగీకరించారు. దానిలో కొన్ని కొన్ని సమస్యలపైన తక్షణ చర్య తీసుకొంటానన్నారు.

రాయబారవర్గంవారు జిల్లాలోని రైతాంగ పరిస్థితులను గురించి కలెక్టరుకు విపులంగా వివరించారు.

శ్రీకాకుళంజిల్లా గ్రంధాలయ సంఘం

తోంద్రంగి, జూన్ 19

శ్రీకాకుళంజిల్లా గ్రంధాలయ సంఘపాలకవర్గ సమావేశం ఇటీవల శ్రీకాకుళంలో జరిగింది. శ్రీ పమ్మిన సూర్యంగారు అధ్యక్షత వహించారు.

సాలూరుతాలూకా గ్రంధాలయ కార్యకర్తలను సమావేశపరచి ఆ తాలూకా గ్రంధాలయ సంఘాన్ని స్థాపించుటకుగాను శ్రీయుతులు చౌక్కావు రామునాయుడు, బలిజేపల్లి సూర్యనారాయణ గార్లకు అధికారమిస్తూ తీర్మానించారు. జూలై నెలలో జిల్లాలోని అందరు గ్రంధాలయ కార్యకర్తలను సమావేశ పరచుటకు నిశ్చయిస్తూ తీర్మానించారు. శ్రీయుతులు లావేటి సాయిరాజు, బగత శ్రీరాములుగార్లను జిల్లాసంఘ పాలకవర్గ సభ్యులుగా చేర్చుకున్నారు. అన్నిరకాల గ్రంథభాండాగారాలకు సమాన వేతనా లివ్వాలనీ - మదరాసు - హైదరాబాదు గ్రంధాలయ చట్టాలను సమన్వయం చేసే ముందు కమిటీ రిపోర్టును ప్రజాభిప్రాయానికి విడుదల చెయ్యాలనీ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

విజయవాడ విశేషాలు

ఢిల్లీ ఆంధ్రప్రముఖులూ, కామన్‌వీల్ పత్రికా సంపాదకులూ అయిన శ్రీ లంకసత్యంగారు 20వ తేదీ సాయంత్రం దివ్యజ్ఞాన సమాజంలో ఏర్పాటయిన సభలో పత్రికా రచయితగా తమ అనుభవాలు గురించి ఉపన్యసించారు. శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారు అధ్యక్షత వహించారు.

సమాజం అధ్యక్షులు శ్రీ యద్దనపూడి రామబ్రహ్మంగారు శ్రీ సత్యంగార్ని పరిచయం చేశారు.

సమ్మె చేస్తున్న 8,500 మంది లండన్ రేవు కార్మికులు సోమవారం నాడు తిరిగి పనిలో ప్రవేశిస్తారు.

పొగాకు కార్మికులకు ప్రావిడెంట్‌నిధి సౌకర్యం

కల్గించాలని అనపర్తి ఐ. ఎల్. టి. డి. కార్మికసభలో అభ్యర్థన

అనపర్తి, జూన్ 19

ఆంధ్ర స్టేటు ఐ. యల్. టి. డి. కంపెనీ వర్కర్సు యూనియన్ 6వ వార్షిక మహాసభ శ్రీ కె. యల్. నరసింహం (యం. పి.) గారు అధ్యక్షత క్రింద గతవారం ఇక్కడ జరిగింది. మహాసభకు రాజమండ్రి, చాగల్లు, కాకినాడ డిపో కార్మిక ప్రతినిధులు, బిక్కవోలు నేషనల్ బీడీ కార్మికసంఘ ప్రతినిధులు సౌహార్ద ప్రతినిధులుగా హాజరయ్యారు.

శ్రీ శివాలశెట్టి ఆంజనేయులు (స్టేటు యూనియన్ రీజినల్ కార్యదర్శి) యూనియన్ జెండాను ఎగురవేశారు.

స్టేట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ బాలాజీదాస్ మహాసభను ప్రారంభించుతూ యూనియన్ ఇంతవరకు సాధించిన విజయాలు పేర్కొన్నారు.

అధ్యక్షులు శ్రీ కె. యల్. నరసింహంగారు ఉపన్యసిస్తూ కార్మికులు రాష్ట్ర సంఘం ద్వారా వున్న హక్కులు కాపాడుకొంటూ కొత్త వాటికై కృషిచేస్తున్నారని, యిటీవల కంపెనీవారు పొన్నూరు, కానూరు డిపోలను మూసివేశారని పొన్నూరులో 14 మంది పర్మనెంటు కార్మికులకు గుమస్తాలవలె యితర డిపోలలో పనులు కల్పించమనికోరిన సంఘ కోర్కెను నిరాకరించటం వలన ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళామనీ అన్నారు.

ఈ పరిశ్రమ క్రింద పనిచేయు కార్మికుల వేతనాలు యితర పరిశ్రమలకన్నా మెరుగుగావున్నా సీజనలు పరిశ్రమ మూలంగా సంవత్సరంలో హెచ్చుభాగం నిరుద్యోగానికి గురికావల్సి వస్తుందనీ, ప్రభుత్వంకూడ యీ కార్మికులకుకూడ ప్రావిడెంటు ఫండు సౌకర్యం కల్పించడం, నూటికి 90 వంతులు పొగాకు పండే ఆంధ్రప్రాంతంలోసిగిరెట్ ఫ్యాక్టరీని స్థాపించడం, చిన్నపరిశ్రమలద్వారా వేలాదిగా గల స్త్రీలకు వృత్తులు కల్పించడం ఎంతేని అవసరమని తెలియజేశారు.

జిల్లాకమ్యూనిస్టుకమిటీ తరఫున శ్రీ పెదపాటి వెంకట్రావుగారు సందేశాన్నిచ్చారు.

డిపోల మూసివేత, కార్మికుల తొలగింపులు మొదలయిన సమస్యలను యజమానులు సత్వరం పరిష్కరించాలనీ, పొగాకు కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ స్కీం వర్తింపజేయాలనీ, దూరప్రాంతాల నుండి వచ్చేవారికి వ్యానుసౌకర్యం కల్గించాలనీ కోరుతూ తీర్మానాలు చేశారు.

జెమ్‌షెడ్‌పూర్ కార్మికులపై నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ, పాకిస్తాన్ కవ్వింపుచర్యలను ఖండిస్తూ తీర్మానాలు చేశారు. దేశరక్షణకై కార్మికవర్గాన్ని సంసిద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీ నల్లమిల్లి సూరారెడ్డి అధ్యక్షులుగను శ్రీ సత్తి కొండారెడ్డి ఉపాధ్యక్షులుగను శ్రీవనం వెంకటస్వామి కార్యదర్శిగను, శ్రీ మల్లిడి సత్యనారాయణరెడ్డి, శ్రీ తాడి సత్తిరెడ్డిగార్లు సహాయ కార్యదర్శులుగను శ్రీ మల్లిడి వెంకన్నగారు కోశాధికారిగను మరి 29 మందితో నూతన కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకొన్నారు. రాత్రి శ్రీ వీరేశలింగం ఆర్టు థియేటర్సు రాజమండ్రివారు 'యారోజు బ్రాకెటు' అను నాటికను, రామవరం నల్లమిల్లి సత్యనారాయణ దాసుగారి హరికథ ఏర్పాటు చేశారు.

మహాసభను దిగ్విజయంచేసిన కార్మికులకు ఆహ్వానితులకు శ్రీ కర్రి గంగిరెడ్డి అభినందనలు తెలియజేశారు.

ఆదిలాబాద్ దర్జీల సంఘం

ఆదిలాబాద్, జూన్ 18

ఆదిలాబాద్ స్థానిక దర్జీలు "రైతు సంఘ కార్యాలయం"లో సమావేశమయ్యారు. శ్రీ రాజిరెడ్డి, గుండేరావుగార్లు సంఘాల ప్రాముఖ్యత గురించి మాట్లాడారు.

దర్జీ సంఘానికి అధ్యక్షునుగా శ్రీ కోటూరి రాములు, కార్యదర్శిగా శ్రీ గుండేరావు, కోశాధిపతిగా శ్రీ కోటూరి నర్సిములు, కార్యవర్గ సభ్యులుగా శ్రీ యుతులు అబ్దుల్ సత్తార్, బాబూరావు, నర్సయ్య, లింగన్న, వలియుద్దీన్‌గార్లను ఎన్నుకున్నారు.

WANTED

Wanted B. Sc. or M. Sc., to handle physical sciences etc. Apply immediately - in person is preferable.

THE MODERN INSTITUTE
Nidubrole :: Guntur (Dt.)

ప్రెసిడెంటు
ఫౌంటెన్ కలము

టెండరు నోటీసు

తాడికొండ శివారు బడేపురం గ్రామములో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామివారి దేవాలయము చుట్టూ ప్రహరిగోడను ఎత్తు చేయుటకు ఎస్టిమేటు రేటు 1,400 రూపాయలకు సీలువేసిన టెండర్లు 26-6-58 తేదీ 3 గంటలవరకు ఆంజనేయ స్వామివారి దేవాలయంవద్ద వారి ఆఫీసులో తీసుకోబడును. నిర్ణీతకాలంలో చేరిన టెండర్లను 26-6-58 వ తేదీ సాయంత్రం 4 గంటలకు హిందూ రిలిజియస్ యెండోమెంట్సు ఇనస్పెక్టరుగారి సమక్షములో తెరువబడును. టెండర్ల ఆమోదము మొదలగు విషయములు ఇనస్పెక్టరుగారి యిష్టమునకు లోబడి జరుపబడును. మిగతా వివరములకు మేనేజింగ్ ట్రస్టువారిని కలుసుకొని తెలిసికొనవచ్చును.

కాళీశెట్టి రాఘవయ్య.
మేనేజింగ్ ట్రస్టి,
ఆంజనేయస్వామి దేవాలయము,

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా నందివాడ విలేజి పంచాయితీలో రు 9520/-లు విలువగల పని క్వారీ రబ్బీషు రోడ్ల రిపేరు చేయుటకుగాను సీల్డు వేసిన టెండర్లు ది 28-6-58 శనివారం సాయంత్రం 4 గంటల వరకు తీసుకొనబడును.

డిపాజిట్ మొత్తం రు 480/-

యితర వివరములు ఆఫీసు పని చేయు వేళలందు తెలుసుకొన గోరతాను.

వేములపల్లి వెంకటకృష్ణ వీరబ్రహ్మం,
ప్రెసిడెంటు పంచాయితీ-నందివాడ.

విద్యార్థి ప్రపంచం

గుంటూరు: అరండల్‌పేట
16వ లైను, 3వ అడ్డరోడ్డు.
బ్రాంచి:
ఓలంబూరిపేట.

S. S. L. C. మొదలు B. A. అన్ని తరగతులకు
ఉన్నతమైన శిక్షణ ఇవ్వబడును.
PRE - UNIVERSITY - English మా ప్రత్యేకత.
గత సంవత్సరపు ఫలితములు అద్భుతము.
వివరములకు: ప్రిన్సిపాల్, డి. ప్రసాదరావు, యం. ఎ. (ఇంగ్లీషు)

అణ్వాయుధ దాడి చేస్తామని అమెరికా బెదిరింపు

ఐక్య ఆరబ్ రిపబ్లిక్ తీవ్ర నిరసన: భద్రతా సమితికి ఫిర్యాదు సంభవం

న్యూఢిల్లీ, జూన్ 21

అణ్వాయుధాలతో పశ్చిమాసియాపై దాడి చేస్తామని అమెరికా రక్షణమంత్రి నీల్ మెకెల్‌రాయ్ చేసిన బెదిరింపులను గురించి చర్చించడం కోసం భద్రతాసమితి అత్యవసర సమావేశం జరపాలని ఐక్యఅరబ్ రిపబ్లిక్ ప్రభుత్వం కోరవచ్చునని తెలుస్తోంది.

కైరోలోని విశ్వసనీయ వర్గాల ద్వారా ఈవిషయం తెలియవచ్చిందని ఢిల్లీలోని ఐక్యఅరబ్ రిపబ్లిక్ రాయబార కార్యాలయం వారు నేడిక్కడ ప్రకటించారు.

అమెరికా రక్షణమంత్రి మెకెల్‌రాయ్ నిన్న కలిఫోర్నియా రాష్ట్రంలోని శాంటిబార్బరా కేంద్రంలో 'కార్యదక్షుల' వార్షిక సమావేశాన్ని ప్రారంభిస్తూ ఇలా బెదిరించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అమెరికా సేనలు లెబనాన్ వ్యవహారంలో జోక్యం కల్పించుకోవలసి వచ్చినప్పుడు మధ్యప్రాచ్యంపై "[illegible]" అణ్వాయుధాలను ప్రయోగించడానికి తాము వెనుకాడబోమని మెకెల్‌రాయ్ ఆ సమావేశంలో చెప్పారు.

ఈ సమావేశానికి అమెరికా సైనిక, నౌక వాయుశాఖలు రెండు వేలమందికి పైగా హాజరయ్యారు.

మెకెల్‌రాయ్ చేసిన ఈ ప్రకటన పట్ల ఐక్య అరబ్ రిపబ్లిక్ ప్రభుత్వం మండిపడుతున్నదని కైరోలో [illegible] చెప్పారు.

అణ్వాయుధాలతో పశ్చిమాసియాపై దాడిచేస్తామని మెకెల్‌రాయ్ చేసిన ప్రకటనను గురించి చర్చించడం కోసం భద్రతా సమితి అత్యవసర సమావేశం జరపాలని ఐక్య అరబ్ రిపబ్లిక్ కోరవచ్చునని కూడా వారు చెప్పారు.

ఇరిగేషన్ మహాసభ

న్యూఢిల్లీ, జూన్ 21

హైదరాబాదులో ప్రాంతీయమైనది ఇరిగేషన్ మహాసభ జూలై 4-5 తేదీలలో జరుగుతుంది. ఆంధ్ర, మద్రాసు, మైసూరు, కేరళ, బొంబాయి రాష్ట్రాల వ్యవసాయ, ఇరిగేషన్ శాఖా మంత్రులు ఈ మహాసభలో పాల్గొంటారు. కేంద్ర వ్యవసాయమంత్రి శ్రీ అజిత్ ప్రసాద్ జైన్ మహాసభను ప్రారంభిస్తారు.

ఇరిగేషన్ లాభాలను వేగిరం చేయడం, నీటిసరఫరాను పెంచడం, పంటకాల్వల త్రవ్వకం, ఇరిగేషన్ వసతులకు కాగలవ్యయం, ఇరిగేషన్ సౌకర్యాలవల్ల కలిగే లాభాలను తెలియచెప్పడంకోసం నమూనా వ్యవసాయక్షేత్రాల స్థాపన, మున్నగు విషయాలనుగురించి చర్చలు జరుపుతారు.

* * *

అరియలూరు రైలు ప్రమాదంలో నష్టపడినవారి రెండు కుటుంబాలకు పరిహారం ఇచ్చారు.

ఎగువ సభకు పోలింగ్

విజయవాడలో ప్రారంభం

విజయవాడ, జూన్ 22

ఆంధ్రప్రదేశ్ ఎగువ సభకు ఉత్తర సర్కారు జిల్లాల నుంచి, స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గాలకు విజయవాడలో పోలింగు నేడు ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ఈ నియోజకవర్గాలలో వరుసగా స్థానిక సంస్థల స్థానాలకు 10 మంది, పట్టభద్రుల స్థానాలకు 17 గురు ఉపాధ్యాయుల స్థానాలకు 16 గురు పోటీచేస్తున్నారు. స్థానిక సంస్థలకు 4 గురిని, పట్టభద్రుల స్థానాలకు ముగ్గురిని, ఉపాధ్యాయ స్థానాలకు ఇద్దర్ని ఆంధ్ర ప్రాంతంనుండి ఎన్నుకోవాల్సి ఉంటుంది.

మధ్యాహ్నం భోజనాలవేళకు ఇక్కడ స్థానికసంస్థల నియోజకవర్గంలోగల ఓట్లన్నీ పోలయినవి. పట్టభద్రుల నియోజకవర్గంలోగల 760 ఓట్లకుగాను 350 ఓట్లూ, ఉపాధ్యాయ నియోజకవర్గంలోగల 344 ఓట్లకుగాను 217 ఓట్లూ పోలయినట్లు తెలుస్తున్నది. తిరిగి 1 గంటకు పోలింగు ప్రారంభమైంది.

యుగోస్లావియా నిరసన

నాగీని ఉరితీసినందుకు

బెల్గ్రేడ్, జూన్ 20

నాగీని ఆయన అనుచరుల్ని ఉరితీసినందుకు హంగరీ ప్రభుత్వానికి అధికార పూర్వకంగా నిరసన తెలియచేస్తానని యుగోస్లావియా ప్రభుత్వం నేడు తెలిపింది.

ఈ విషయమై యుగోస్లావియా ప్రభుత్వం ఒక లేఖను తయారుచేస్తూందని తెలుస్తూంది.

అమృతసర్ మహాసభ నిర్ణయాల ప్రాధాన్యం

శ్రీ ఎం. ఎస్. గోవిందన్‌నాయర్ ప్రకటన

తిరువనంతపురం, జూన్ 21

కేరళ రాష్ట్రమంతటా కమ్యూనిస్టు పార్టీ సభ్యుల సమావేశాలను ఏర్పాటుచేసి, అమృతసర్ కమ్యూనిస్టు మహాసభ నిర్ణయాలను వివరించి చెప్పాలని కేరళ కమ్యూనిస్టు కమిటీ నిర్ణయించినట్లు కార్యదర్శి శ్రీ ఎమ్. ఎస్. గోవిందనాయర్ నేడిక్కడ పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తూ చెప్పారు.

ప్రత్యేకించి కేరళకు అమృతసర్ పార్టీ మహాసభ నిర్ణయాల ప్రాధాన్యం అధికంగా గలదనీ, అందుచేత ఆ నిర్ణయాల లోతుపాతులను సంపూర్ణంగా కేరళలో కమ్యూనిస్టుపార్టీ సభ్యులదృష్టికి తేవటం అవసరమనీ ఆయన అన్నారు.

ఎన్నికలద్వారా అధికారంలోకి రావాలన్న సూత్రాన్ని కమ్యూనిస్టు పార్టీ తన ధ్యేయంగా పెట్టుకొన్నది. అంతర్యుద్ధం, సాయుధ సంఘర్షణలు అవసరంలేదని కమ్యూనిస్టు పార్టీ భావిస్తున్నది. ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగం విషయంలో పార్టీ వైఖరి మారింది. ఇప్పుడున్న యంత్రాన్ని నాశనం చేయవలసిన అగత్యం లేకుండానే, పార్టీ కార్యక్రమాలను, కార్య విధానాలను ఇప్పటిప్రభుత్వ యంత్రాంగంద్వారా అమలు జరపవచ్చునని పార్టీ అభిప్రాయపడుతున్నది. డిక్రీలు జారీచేయవలసిన అవసరంలేకుండానే శాసనాల ద్వారా సామాజిక, ఆర్థిక పరిణామాలను తీసుకు రావచ్చునని పార్టీ నమ్ముతున్నది. శాసనసభా కార్యక్రమం ద్వారా సామాజిక, ఆర్థిక సంస్కరణలను ఎంతవరకు అమలుజరపవచ్చు అన్న ప్రయోగం ఇప్పుడు కేరళలో సాగిస్తున్నాం. ఇతర రాష్ట్రాలలో పరిస్థితివేరు. అక్కడ కమ్యూనిస్టుపార్టీ అత్యధిక ఓటర్లను తన పక్షం వైపుకు త్రిప్పుకొని, కమ్యూనిస్టు ప్రభుత్వ స్థాపనకు అవసరమైన మెజారిటీని సంపాదించటంకోసం కృషిచేస్తున్నవి. అందుచేత ప్రత్యేకించి కేరళకు కమ్యూనిస్టుపార్టీ చేపట్టిన కొత్త కార్యవిధానం ప్రాధాన్యం అధికంగా వుంటుంది. ఈ ప్రాధాన్యాన్ని పార్టీ సభ్యులకు వివరించటంకోసం పార్టీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిశ్చయించామని ఆయన వివరించారు.

మొదట అమృతసర్ మహాసభ నిర్ణయాలను పార్టీసభ్యులకు వివరించి చెప్పుతామనీ, ఆటుతర్వాత పార్టీ సభ్యత్వం చేర్పించే కార్యక్రమం ప్రారంభిస్తామనీ, ఆ కార్యక్రమం పూర్తయిన తర్వాత వివిధ స్థాయిలలో పార్టీ కమిటీల ఎన్నికలు జరుగుతాయనీ శ్రీ గోవిందన్ నాయర్ చెప్పారు.

హంగరీ మాజీ ప్రధాని ఇమ్రినాగీ ఉరితీతపైన వ్యాఖ్యానించవలసిందిగా పత్రికా విలేఖరులు కోరగా అందుకు శ్రీ గోవిందన్‌నాయర్ నిరాకరిస్తూ ఇలా చెప్పారు:

"జూలై 8 వ తేదీన హైదరాబాద్‌లో సమావేశమవుతున్న కమ్యూనిస్టుపార్టీ జాతీయసమితి కార్యవర్గంలో ఈ విషయమై చర్చిస్తాం."

విజయవాడ రేడియో

విజయవాడ, జూన్ 20

ఇదివరలో మద్రాసు రేడియో స్టేషన్ అసిస్టెంటు డైరెక్టరుగా వున్న శ్రీ టి. శంకరన్ నేడు విజయవాడ రేడియో స్టేషన్ అసిస్టెంటు డైరెక్టరుగా చార్జితీసుకున్నారు.

'విదేశీయుల జోక్యం కోరవద్దు'

లెబనాన్ ప్రభుత్వానికి హామర్షెల్డు హితవు

బీరుట్, జూన్ 21

విదేశీయులజోక్యం కోరకుండానే దేశంలో ఏర్పడ్డ సంక్షోభాన్ని ఏదో విధంగా పరిష్కరించుకోమ్మని ఐ రా స కార్యదర్శి శ్రీ డాగ్ హామర్ షెల్డ్ లెబనాన్ ప్రభుత్వానికి సలహా ఇచ్చారని తెలుస్తున్నది విదేశీయుల జోక్యంవల్ల ఇప్పటికే ప్రమాదభరితంగా ఉన్న పరిస్థితులు యుద్ధానికే దారితీయవచ్చునని హామర్షెల్డ్ హెచ్చరించాడట.

రాజీనామా ఇవ్వమని అధ్యక్షుడు చామున్‌పై పాశ్చాత్యదేశ ప్రభుత్వాలు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తున్నది. కొత్త అధ్యక్షుణ్ణి ఎన్నుకొంటే, పరిస్థితులు మరింత విషమించకుండా అరికట్టవచ్చునని వారి భావం.

దేశం సరిహద్దుల్లో అత్యధికభాగం విప్లవసైన్యాల స్వాధీనంలోఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఐక్య అరబ్ రిపబ్లిక్‌నుండి ఆయుధాలు లెబనాన్‌కి చేరవేయబడుతున్నాయని రుజువు చేయడం కష్టమని వీరి అభిప్రాయం.

భారతదేశ పరిశీలక బృందాలు నేడే యుద్ధ ప్రాంతంలోనికి తరలి వెళ్ళాయి. ఒకటి ట్రిపోలీకి, మరొకటి తూర్పు లెబనాన్ ప్రాంతానికి వెళ్ళాయి.

కైరోకు హామర్షెల్డ్

సిరియాలో పరిశీలకులనుంచే విషయమై నాజర్‌తో సంప్రతింపులు

బీరుట్, జూన్ 21

సిరియావైపున ఐరాస పరిశీలకులను నియమించే విషయంలో అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్ అనుమతిని పొందడంకోసం ఐరాస కార్యదర్శి హామర్షెల్డ్ నేడు విమానంలో ఇక్కడి నుంచి కైరోకు బయలుదేరారు.

సిరియావైపు నుంచి విప్లవకారులకు ఆయుధాలందుతున్నాయని లెబనాన్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది.

కాని సరిహద్దు ప్రాంతంలో నూటికి 90 వంతులకు పైగా విప్లవకారుల వశంలోవుంది. ఆప్రాంతాలకు వెళ్ళి ఐరాస పరిశీలకులు తనిఖీ చేయడంవల్ల న్యాయశాస్త్రసంబంధమైన అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఐరాస పరిశీలకులు విప్లవకారులను గుర్తించి వారితో మాట్లాడుతున్నందుకు లెబనాన్ ప్రభుత్వం ఆక్షేపిస్తోంది.

ఈ ఇబ్బందిని తొలగించుకోవాలంటే సిరియావైపున పరిశీలకులను నియమించడం ఒకటే మార్గం. కాని భద్రతాసమితిలో చర్చ జరిగినప్పుడు ఐక్యరిపబ్లిక్ ప్రతినిధి ఉమర్‌లాత్ఫీ ప్రసంగిస్తూ ఐరాస పరిశీలకులు లెబనాన్ భూభాగంమీద మాత్రమే పనిచేయగలుగుతారన్నారు.

అందుకని పరిశీలకులను సిరియాకు రానివ్వవలసిందని ఇప్పుడు హామర్షెల్డు అధ్యక్షుడు నాజర్‌ను విజ్ఞప్తి చేయడంకోసం బయలుదేరారు. గాజాలో వున్న ఐరాస దళాల భవిష్యత్తును గురించి కూడా ఆయన నాజర్‌తో చర్చిస్తారు.

హామర్షెల్డు కైరో బయలుదేరడానికి ముందు పరిశీలక బృందంతో చాలా చర్చలు జరిపారు. నిన్న ఆయన విమానంమీద లెబనాన్ అంతా కలయతిరిగి చూశారు.

జోర్డాన్ ఇజ్రాయిల్ తగాదా విషయమైకూడా ఉభయ ప్రభుత్వాలతోను ఆయన చర్చలు జరుపుతారని అంటున్నారు.

బీరుట్, బాల్బెక్, ట్రిపోలీ ప్రాంతాలలో ప్రభుత్వ సేనలకూ విప్లవకారులకూ యుద్ధంసాగుతోంది. విప్లవకారులున్నట్లు అనుమానం తోచిన ప్రతి ఇంటినీ కూలగొట్టడానికి సేనకు అనుమతిస్తూ ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు జారీచేసింది. దీని ప్రకారం నిన్న బీరుట్‌లో అప్పుడే రెండిళ్లను కూలగొట్టారు.

బొంబాయి మునిసిపల్ కార్మికసమ్మె విరమణ

బొంబాయి, జూన్ 22

8 రోజులుగా సాగుతున్న బొంబాయి మునిసిపల్ కార్మికుల సమ్మె నేడు అంతమైంది. పెక్కుమంది కార్మికులు నేడు పనిలోకి వెళ్ళారు.

మునిసిపల్ మజ్దూర్ సంఘానికి, కార్పొరేషన్ అధికారులకు కుదిరిన ఒప్పందాన్ని మజదూర్‌సంఘ కార్యదర్శి ఫెర్నాండెజ్ నేడు 5 వేలమంది కార్మికులసభలో వివరించారు.

* * *

షిల్లాంగ్, జూన్ 20

హిమాలయ పర్వతప్రాంతాల్లో భారీఎత్తున వర్షాలు పడ్డట్టు యిక్కడికి చేరిన వార్తలు తెలుపుతున్నాయి. ఇందువల్ల హిమాలయ నదులలో ప్రవాహం హెచ్చుతోంది.

అర్జీలపై స్టాంపు ఫీజు పెంపుదల

హైదరాబాదు, జూన్ 22

సికింద్రాబాదు కార్పొరేషన్ అర్జీలపైన, దరఖాస్తులపైన విధిస్తున్న స్టాంపుఫీజును ఒక్కణానుండి ఒక్క రూపాయి 12 నయాపైసలకు పెంచింది.


నేడే చూడండి.
శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ వారి
శ్రీకృష్ణమాయ
(నారద సంసారం)
నాగేశ్వరరావు + రమణారెడ్డి + రాజనాల + కుటుంబరావు
ఏ.వి.సుబ్బారావు + డా. శివరామకృష్ణయ్య + కె.వి.యస్. శర్మ +
జమున + మాలతి + సూర్యకళ + సూర్యకాంతం + ఛాయాదేవి +
మాటలు. రావూరు
సంగీతం. టి.వి. రాజు.
ఛాయాగ్రహణం
కమాల్‌ఘోష్.
దర్శకుడు. సి.యస్.రావు.
చమ్రియా రిలీజ్.

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు); కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి - ఎడిటర్, ప్రింటర్, & పబ్లిషర్: విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ - 2.